నేడు
TELUGU DAILY
విలేకరులు కావలెను
అనతికాలంలోనే పత్రికారంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన నేడు తెలుగు దినపత్రికలో పనిచేయుటకు రిపోర్టర్లు కావలెను. తెలంగాణలోని 33 జిల్లాల్లో పని చేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి ఉన్నవారు. nedudailynews@gmail.comకు బయోడెటా పంపగలరు.
9346984911
9133445456

సంచలన వార్తలకు
# నేడు
TELUGU DAILY

గురువారం | 19.02.2026 | సంపుటి : 3 | సంచిక :299 | పేజీలు : 8 | వెల : 2/- | www.nedudailynews.com



మూడో రోజూ లాభాల్లో సూచీలు 08



## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 115 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 142 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 206 (కిలో) |
| స్కిన్ లెస్ | 234 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹74

## అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు

నగరంలో అర్హుల జాబితా తయారీ

అసంపూర్తి 2 బిహెచ్‌కె ఇళ్ల పూర్తి

బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్, ఫిబ్రవరి 18 :హైదరాబాద్ జిల్లాలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ హైదరాబాద్ ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. బుధవారం సచివాలయంలోని తన ఛాంబర్ నందు రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి

-మిగతా 2 లో..

మంత్రి వివేక్ కాన్వాయ్‌పై దాడి కేసు

## మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అరెస్ట్

బిఆర్ఎస్ ఆందోళనతో క్యాతన్‌పల్లిలో తీవ్ర ఉద్రిక్తత



మంచిర్యాల,ఫిబ్రవరి18 : బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. మంత్రి వివేక్ కాన్వాయ్‌పై దాడి కేసులో మాజీ ఎమ్మెల్యేను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పెద్దఎత్తున బాల్క సుమన్ ఇంట్లోకి వెళ్లిన పోలీసులు.. అరెస్ట్‌కు

-మిగతా 2 లో..

విడాకులు ఇచ్చిందన్న కోపంతో..

## మాజీ భార్య హత్య

వనస్థలిపురంలో దారుణ ఘటన



హైదరాబాద్,ఫిబ్రవరి 18 : హైదరాబాద్ వనస్థలిపురం గ్రీన్ సిటీ కాలనీలో దారుణ ఘటన చోటు చేసుకుంది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని సునీత (30)ను ఆమె మాజీ భర్త మహేష్ అత్యంత కిరాతకంగా హత్య చేయడం కలకలానికి గురిచేసింది. పోలీసులు కథనం ప్రకారం.. సునీత

-మిగతా 2 లో..



## భారత్‌కు ఇది చరిత్రాత్మక సమయం

భారత్ ఒక గొప్ప సాంకేతిక పరివర్తన దశలో ఉంది

గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్

దేశ భవిష్యత్తును ఏఐ నిర్దేశించబోతోందని ఉద్ఘాటన

ప్రధాని మోదీతో భేటీ, ఏఐపై సహకారానికి చర్చలు

భారతదేశం ఒక గొప్ప సాంకేతిక పరివర్తనకు నాంది పలుకుతోందని, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కీలక పాత్ర పోషించనుందని ఆల్ఫాబెట్, గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ అన్నారు. ప్రస్తుత దశను పరివర్తన సమయంగా ఆయన అభివర్ణించారు. బుధవారం ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, "ఇది టెక్నాలజీ, ఆవిష్కరణలు, మరియు ఏఐ విస్తృత వినియోగంతో నడిచే ఒక దశాబ్ద కాలపు మార్పుకు నాందిలా అనిపిస్తోంది" అని పేర్కొన్నారు.

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18 : ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా లబ్ధి పొందేందుకు భారతదేశం ప్రత్యేకమైన స్థితిలో ఉందని, అయితే ఈ అవకాశంతో పాటు గొప్ప బాధ్యత కూడా ఉంటుందని సుందర్ పిచాయ్ నొక్కిచెప్పారు. ఏఐ పరిశోధనలలో బలమైన పెట్టుబడులు పెట్టాలని, దాని వినియోగాన్ని అన్ని రంగాలకు విస్తరించాలని

-మిగతా 2 లో..




## దేశవ్యాప్తంగా 37 రాజ్యసభ స్థానాలకు ఎన్నిక

తెలంగాణలో కేఆర్ సురేశ్ రెడ్డి, అభిషేక్ సింఘ్వీల స్థానాలు ఖాళీ

మార్చి 16న ఎన్నికల నిర్వహణకు ఇసి రంగం సిద్ధం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18 : దేశవ్యాప్తంగా 37 రాజ్యసభస్థానాలు ఖాళీ కాబోతున్నాయి. ఖాళీ కాబోతున్న రాజ్యసభ సీట్లకు ఎన్నికలు నిర్వహించనున్నారు. మొత్తం పది రాష్ట్రాల్లో సుమారు 37 రాజ్యసభ స్థానాలు ఖాళీ కాబోతున్నాయి. ఆ స్థానాలను భర్తీ చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం మార్చి 16వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నది. ఈ మే-రకు ఎన్నికల

-మిగతా 2 లో..

## గ్రీన్ ఎనర్జీతోనే విప్లవం

నెట్ జీరో స్టేట్ గా తెలంగాణ

అందుకే క్యూర్, ప్యూర్, రేర్ విభజన

పట్టణాభివృద్ధిలో తెలంగాణ దేశానికే ఆదర్శం

ముంబయి క్లైమెట్ వీక్ కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి

గ్రీన్ ఎనర్జీ ప్రపంచ పరిరక్షణకు లాభదాయకమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. తెలంగాణలో గ్రీన్ ఎనర్జీకి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన వెల్లడించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో గ్రీన్ ఎనర్జీకి తాము ప్రోత్సాహిస్తున్నట్టు వెల్లడించారు. తెలంగాణ 30 లక్షలకు పైగా పంప్‌సెట్‌లు, దాదాపు 50 లక్షల గృహాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. ఈ శక్తిని బొగ్గు, సాంప్రదాయ ఇంధన వనరుల నుంచి సోలార్, గ్రీన్ ఎనర్జీ వైపు మార్చడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. కాలుష్య నియంత్రణ, రీసైక్లింగ్, స్థిర శక్తి ఉత్పత్తి పద్ధతులపై నిరంతరం పరిశోధనలు కొనసాగిస్తు న్నామన్నారు.




హైదరాబాద్‌ను 2034 నాటికి నెట్ జీరో నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. పట్టణాభివృద్ధిలో భాగంగా తాము కార్బన్ ఫుట్‌ప్రింట్ ఆడిట్ చేపట్టనున్న తొలి భారత నగరంగా హైదరాబాద్ నిలవబోతుందని తెలిపారు. వచ్చే ఐదేళ్లలో కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్)లో దాదాపు పరిశ్రమలు ఉండవని స్పష్టం చేశారు. మహారాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన 'క్లైమేట్ వీక్' సదస్సులో రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు.

ముంబయి, ఫిబ్రవరి 18 : బాంద్రా కుర్లా జియో కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం ఉదయం జరిగిన ఈ సమావేశంలో దేశంలోని పట్టణాలు, నగరాభివృద్ధి, వాతావరణ మార్పులకు అనుగుణ మైన విధానాలపై ముఖ్యమంత్రి తెలంగాణ దృక్పథాన్ని వివరించారు. దేశ పట్టణాభివృద్ధికి సంబంధించిన సదస్సులో మాట్లాడడం తనకు సంతోషంగా ఉందన్నారు. 2047 లక్ష్యాన్ని అర్థం చేసుకోవాలంటే 1947 నుంచి భారత అభివృద్ధి ప్రయాణాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉందని

-మిగతా 2 లో..



## ధరణి దోపిడిపై ఉక్కుపాదం

తీగలాగితే డొంక కదిలినట్లుగా ధరణి వ్యవహారం

అక్రమాలపై కఠిన చర్యలు తప్పవు.. కోడ్ ఆడిట్‌కు ఆదేశాలు

రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి

హైదరాబాద్, ఫిబ్రవరి 18 : తీగ లాగితే డొంక కదిలినట్లుగా ధరణి పోర్టల్ వ్యవహారం ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రజల ఆస్తుల రక్షణకు నిర్మించవలసిన వ్యవస్థనే ఆనాటి ప్రభుత్వంలోని కొంతమంది ప్రముఖులు తమ స్వార్థ

-మిగతా 2 లో..

## రీజినల్ రింగ్ రోడ్డు గేమ్ చేంజర్

రోడ్డు నెట్‌వర్క్‌పై ప్రత్యేక దృష్టి అవసరం

2026-27 వార్షిక బడ్జెట్ ప్రపోజల్స్ పై ఆరా

అధికారులతో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి సమీక్ష



హైదరాబాద్, ఫిబ్రవరి 18 : రాష్ట్ర అభివృద్ధిలో రోడ్లు భవనాలు శాఖ ఎంతో కీలక పాత్ర పోషిస్తున్నదని, స్పష్టమైన ప్రణాళికతో వార్షిక బడ్జెట్ ఎస్టిమేట్స్ ఉండాలని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గత ఏడాది బడ్జెట్... పనుల పురోగతి..విడుదలైన నిధులపై కూలంకషంగా మంత్రి చర్చించారు. రీజినల్ రింగ్ రోడ్డు లాంటి గేమ్ చేంజర్ ప్రాజెక్టులపై ప్రధాన దృష్టి సారించాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో

-మిగతా 2 లో..

## విద్య, ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యం

యుద్ధ ప్రాతిపదికన హాస్టల్ భవనాల మరమ్మతులు

సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల్లో అధికారుల నిరంతర పరిశీలన

లక్ష కోట్లకు పైగా నిధులతో రాష్ట్రంలో రహదారుల నిర్మాణం

సాంస్కృతిక కార్యక్రమాలు నిరంతరం జరగాలి

దేశంలో నే మోడల్ గా అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లు

ప్రీ బడ్జెట్ సమావేశాల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



హైదరాబాద్, ఫిబ్రవరి 18 : రాష్ట్ర ప్రభుత్వం విద్య, ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యతను ఇస్తుందని, ఈ రంగాల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఎన్ని నిధులైన ఖర్చు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెనుకాడబోదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం

-మిగతా 2 లో..



# భారత్‌కు ఇది చరిత్రాత్మక సమయం

(మొదటిపేజీ తరువాయి)

ఆయన సూచించారు. సమాజంలోని ప్రతి ఒక్కరికీ, ఆర్థిక వ్యవస్థలోని ప్రతి విభాగానికి ఏఐ ప్రయోజనాలు చేరేలా పునాది స్థాయి నిర్మాణం జరగాల్సిన ఆవశ్యకతను ఆయన వివరించారు. గత కొన్నేళ్లుగా భారత్ డిజిటల్ రంగంలో అద్భుతమైన పురోగతి సాధించిందని పిచాయ్ ప్రశంసించారు. "భారతీయ వినియోగదారులు వాయిస్ ఆధారిత, ఇమేజ్ ఆధారిత సెర్చ్‌లను ప్రపంచంలోనే అత్యధికంగా స్వీకరిస్తున్నారు. ఇది దేశ ప్రజలు కొత్త టెక్నాలజీలను ఎంత వేగంగా అందిపుచ్చుకుంటున్నారో చూపిస్తోంది," అని ఆయన తెలిపారు. గూగుల్ ఏఐ టూల్ 'జెమినై'కి భారతదేశం అతిపెద్ద మార్కెట్లలో ఒకటిగా నిలవడం, ఇక్కడి వినియోగదారులలో ఏఐ పట్ల పెరుగుతున్న ఆసక్తిని ప్రతిబింబిస్తోందని అన్నారు. ఈ పర్యటనలో భాగంగా, సుందర్ పిచాయ్ ప్రధాని నరేంద్ర మోదీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఏఐ రంగంలో భారత్ సాధిస్తున్న పురోగతి, దేశంలోని ప్రతిభావంతులైన విద్యార్థులు, నిపుణులతో గూగుల్ ఎలా కలిసి పనిచేయగలదనే అంశాలపై వారు చర్చించారు. ఈ భేటీపై ప్రధాని మోదీ స్పందిస్తూ, ఏఐ రంగంలో ప్రభుత్వం, గూగుల్ మధ్య సహకారాన్ని మరింతగా పెంచుకునే అవకాశాలపై పిచాయ్‌తో ఫలవంతమైన చర్చలు జరిపినట్లు తెలిపారు. భవిష్యత్ సాంకేతిక ప్రపంచానికి విద్యార్థులను సిద్ధం చేయాల్సిన అవసరాన్ని కూడా పిచాయ్ ప్రస్తావించారు. పాఠశాల విద్యార్థులలో చిన్న వయసు నుంచే ఆవిష్కరణ, సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో 'అటల్ టింకరింగ్ ల్యాబ్స్'తో కలిసి గూగుల్ పనిచేస్తోందని, తరగతి గదుల్లోకి రోబోటిక్స్, కోడింగ్‌ను తీసుకువెళుతున్నామని వివరించారు. సరైన పెట్టుబడులు, విధానాలు అమలు చేస్తే, భారతదేశ సమగ్ర అభివృద్ధికి, దీర్ఘకాలిక పరివర్తనకు ఏఐ ఒక శక్తివంతమైన సాధనంగా మారుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# దేశవ్యాప్తంగా 37 రాజ్యసభ స్థానాలకు ఎన్నిక

(మొదటిపేజీ తరువాయి)

సంఘం షెడ్యూల్ వివరాలను విడుదల చేసింది.తెలంగాణ నుంచి కేఆర్ సురేశ్ రెడ్డి, డాక్టర్ అభిషేక్ మను సింఘ్వీ స్థానాలు ఖాళీ కానున్నాయి. ఏప్రిల్ 9వ తేదీన ఆ ఇద్దరి పదవీకాలం ముగియనున్నది. ఇక మహారాష్ట్ర నుంచి అత్యధికంగా ఏడు మంది రాజ్యసభ ఎంపీలు తమ పదవీకాలాన్ని ఏప్రిల్ 2వ తేదీన పూర్తి చేసుకోనున్నారు. దీంతో ఆ రాష్ట్రానికి చెందిన ఆ ఏడు స్థానాలకు కూడా ఎన్నికలు నిర్వహించనున్నారు. ఒడిశాలో నలుగురు, తమిళనాడులో ఆరుగురు, బెంగాల్‌లో అయిదుగురు, అస్సాంలో ముగ్గురు , బీహార్‌లో అయిదుగురు, చత్తీస్‌ఘడ్, హర్యానాల్లో ఇద్దరేసి, హిమాచల్ ప్రదేశ్‌లో ఒకరి సీటు కోసం ఎన్నికలు నిర్వహించనున్నారు. 37 మంది రాజ్యసభ సభ్యులు ఏప్రిల్‌లో రిటైర్ కానున్నారని, వారి స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నది. ఎన్నికల షెడ్యూల్‌కు చెందిన నోటిఫికేషన్ ఫిబ్రవరి 26వ తేదీన రిలీజ్ చేయనున్నారు. మార్చి 5 వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చు. మార్చి 9వ వరకు దరఖాస్తులు విత్‌డ్రా చేసుకోవచ్చు. 16న ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు ఓటింగ్ జరుగుతుంది. ఆ రోజే సాయంత్రం 6 గంటల తర్వాత ఓట్ల లెక్కింపు పక్రియ ఉంటుంది.

# రీజినల్ రింగ్ రోడ్డు గేమ్ చేంజర్

(మొదటిపేజీ తరువాయి)

2047 రైసింగ్ తెలంగాణ నినాదంలో రాష్ట్ర రోడ్ నెట్వర్క్ అభివృద్ధి అత్యంత కీలకం కానుందన్నారు. ముఖ్యమంత్రి రాష్ట్ర రోడ్ నెట్వర్క్ అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి పెట్టారు.. హ్యామ్ రోడ్ల నిర్మాణంతో రాష్ట్ర వ్యాప్తంగా అద్దం లాంటి రోడ్లు నిర్మించబోతున్నాం. ఇప్పటికే ఉన్న బాలారిష్టాలు దాటేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేశాం.. అధికారులు కూడా మనసుపెట్టి పనిచేయాలి. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నిధుల వాటాపై కన్ఫ్యూజన్ లేకుండా పారదర్శకంగా వ్యవహరించాలి.. హైదరాబాద్-విజయవాడ (ఎన్హెచ్ 65) 8లేన్ విస్తరణ పనులు కూడా త్వరలో ప్రారంభం కానున్నాయి. పనులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని మరోసారి కోరతా.. తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన రోడ్డు...ఇది పూర్తయితే హైదరాబాద్ నుండి విజయవాడ రెండున్నర గంటల్లో చేరుకోవచ్చు. రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా కేంద్ర సహకారం అందించే ప్రాజెక్టుల్లో వేగం పెంచాలని కేంద్ర మంత్రులను కలుస్తానని కోమటిరెడ్డి తెలిపారు.

# మంత్రి వివేక్ కాన్వాయ్‌పై దాడి కేసు

(మొదటిపేజీ తరువాయి)

సహకరించాలని కోరారు. ఇందుకు మాజీ ఎమ్మెల్యే ససేమిరా అనడంతో బలవంతంగా ఆయనను అరెస్ట్ చేసి పోలీస్ వ్యాన్‌లో తరలించారు. అయితే బాల్క సుమన్‌ను అరెస్ట్ చేసేందుకు వచ్చిన పోలీసులను బీఆర్ఎస్ కార్యకర్తలు అడ్డుకున్నారు. కార్యకర్తల ఆందోళనల మధ్యే సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. వైద్య పరీక్షల నిమిత్తం ఆయనను ఆస్పత్రికి తరలించారు. దీంతో క్యాతనపల్లిలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక సందర్భంగా మంగళవారం ఘర్షణలు చోటుచేసుకున్నాయి. మంత్రి వివేక్ వెంకటస్వామి కాన్వాయ్‌పై బీఆర్ఎస్ కార్యకర్తలు రాళ్లు రువ్వారని ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో బాల్క సుమన్ సహా పలువురు బీఆర్ఎస్ నేతలపై క్యాతనపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో మాజీ ఎమ్మెల్యేను అరెస్ట్ చేసేందుకు పోలీసులు భారీగా తరలివచ్చారు. ఆయన నివాసం చుట్టూ వందలాది మంది బీఆర్ఎస్ కార్యకర్తలు చేరుకుని అరెస్టును అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులు, కార్యకర్తల మధ్య తోపులాట, ఉద్రిక్తత నెలకొంది. చివరకు బీఆర్ఎస్ శ్రేణులను చెదరగొట్టిన పోలీసులు సుమన్‌ను అరెస్ట్ చేశారు.

# గ్రీన్ ఎనర్జీతోనే విప్లవం

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. స్వాతంత్ర్యం అనంతరం తొలి నాలుగు దశాబ్దాల్లో దేశంలో ప్రధాన ప్రాధాన్యతలు విద్యా వ్యవస్థ, నీటిపారుదల రంగాలేనని గుర్తు చేశారు. గ్రామీణ ప్రాథమిక పాఠశాలల నుంచి ఐఐటి,ఐఐటెం, ఐఐఎస్‌సి వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలను ఏర్పాటు చేసుకున్నామని గుర్తు చేశారు. విద్యుత్, సాగునీటికి భారీ ఆనకట్టలను నిర్మించి రైతుల పొలాలను నీటితో అనుసంధానించామని తెలిపారు. 1990 నాటికి భారత్ ఆహార కొరత నుంచి ఆహార భద్రత సాధించిందని చెప్పారు. దీంతో ప్రజల జీవిత కాలం పెరిగిందని ముఖ్యమంత్రి అన్నారు. దేశంలోని ఇంజినీర్లు, వైద్యులు, శాస్త్రవేత్తలు ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమంగా గుర్తింపు పొందే విధంగా అభివృద్ధి సాధించిందని వివరించారు. 1991 నుంచి 2020 వరకు లిబరలైజేషన్, ప్రయి-ంవేటైజేషన్, గ్లోబలైజేషన్ సంస్కరణలతో భారత్ సేవా రంగంలో శక్తివంతమైన దేశంగా ఎదిగిందని సీఎం వివరించారు. టెలికాం , సాఫ్ట్ వేర్ విప్లవంతో పట్టణ మౌలిక సదుపాయాల విస్తరణ సాధ్యమైందని అన్నారు. భారత నిపుణులు సిలికాన్ వ్యాలీ వంటి ప్రపంచ కేంద్రాల్లో విజయాలు సాధించారని తెలిపారు. 1991 తర్వాత గ్లోబల్ సాఫ్ట్ వేర్, టెక్ సంస్థలు తమ బ్యాక్ ఆఫీస్ కార్యకలాపాలకు భారత్‌ను ఎంచుకున్నాయని అన్నారు. అందుకే ప్రపంచంలో అత్యధిక గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు మన దేశంలో ఉన్నాయన్నారు. అయితే, ఈ టెక్ పురోగతిలో తయారీ రంగం ఎక్కువగా అవకాశాలు కోల్పోయినట్లు అభిప్రాయపడ్డారు. కోవిడ్ అనంతరం ప్రభుత్వాల దృష్టికోణం మారిందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం అభివృద్ధి వ్యూహంలో తయారీ రంగం, పర్యావరణ పరిరక్షణ, సుస్థిరత్వం కీలకంగా మారాయని అన్నారు. ఏ ఆర్థిక వ్యవస్థకైనా విద్యుత్ ఉత్పాదక వనరులే అసలైన కరెన్సీ అన్నారు. విద్యుత్ ఉత్పత్తి, వినియోగం అభివృద్ధికి కొలమానంగా నిలుస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి లక్ష్యాలను ప్రస్తావిస్తూ, రాష్ట్ర జీడీపీని 200 బిలియన్ డాలర్ల స్థాయి నుంచి 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయడం లక్ష్యమని తెలిపారు. భవిష్యత్ అభివృద్ధికి ఆర్థిక వ్యవస్థ, పర్యావరణం, విద్య, నైపుణ్యాలు, వనరులు, ఉపాధి ప్రధాన స్తంభాలుగా నిలుస్తాయని అన్నారు. రాష్ట్ర వ్యూహాత్మక అభివృద్ధికి తెలంగాణను క్యూర్,ప్యూర్,




రేర్ జోన్‌లుగా విభజించినట్లు ముఖ్యమంత్రి వివరించారు. హైదరాబాద్‌ను 160 కి.మీ. పొడవైన ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీగా ప్రకటించగా, 360 కి.మీ.ల రీజినల్ రింగ్ రోడ్ మధ్య ప్రాంతాన్ని ప్యూర్ జోన్‌గా రూపొందించి తయారీ రంగానికి నిర్దేశిరచినట్లు చెప్పారు. ఈ ప్రాంతాన్ని దేశంలోనే అతిపెద్ద తయారీ కేంద్రంగా అభివృద్ధి చేసి చైనా ప్లస్ 1 కు ప్రత్యామ్నాయంగా తెలంగాణను నిలబెట్టడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ తయారీ వృద్ధి గ్రీన్ ఎనర్జీ ఆధారంగా సాగుతుందని స్పష్టం చేశారు. తెలంగాణ విద్యుత్ వినియోగంపై ముఖ్యమంత్రి గణాంకాలను వెల్లడించారు. రాష్ట్రం రోజుకు సగటున 16,610 మెగావాట్ల విద్యుత్ వినియోగిస్తోందని తెలిపారు. గత ఏడాది గరిష్ట డిమాండ్ 17,162 మెగావాట్లు నమోదైందని, ఈ ఏడాది అది 19,000 మెగావాట్లను దాటుతుందని అంచనాలున్నాయని వివరించారు. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యంతో గరిష్ట డిమాండ్ 34,000 మెగావాట్లకు చేరుతుందని అంచనా వేశారు. రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తిలో సుమారు 24.8? లేదా దాదాపు 25? గ్రీన్ సోర్సుల నుంచే వస్తోందని తెలిపారు. దేవిధంగా, 360 కిలోమీటర్ల పొడవు గల రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణం కొనసాగుతోందని, రీజినల్ రింగ్ రైల్వే ప్రణాళికలు అమలులో ఉన్నాయని ముఖ్యమంత్రి అన్నారు.. ఓఆర్ఆర్, ట్రిప్ ఆర్ మధ్య ప్రాంతాన్ని ప్రధాన తయారీ జోన్‌గా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులు, ముఖ్యంగా డేటా సెంటర్లు, పరిశ్రమలు గ్రీన్ ఎనర్జీని కోరుకుంటున్నాయని తెలిపారు. తెలంగాణ ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్న క్రమంలో వనరుల పెరుగుదలలో ప్రధాన భాగం గ్రీన్‌గా ఉండాలని తన సంకల్పాన్ని వ్యక్తం చేశారు. ÷ూతావరణ మార్పులు, కోవిడ్ ప్రభావాలను ప్రస్తావిస్తూ, ప్రస్తుత పరిస్థితిని క్లైమేట్ ఎమర్జెన్సీగా ముఖ్యమంత్రి అభివర్ణించారు. అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి సృష్టి, ఉత్పత్తి , వినియోగం పెంపు కొనసాగుతూనే పర్యావరణ పరిరక్షణకు సమాన ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. తెలంగాణ మూడు జోన్‌లలో గ్రీన్ స్ట్రాటజీని అవలంబించిందని తెలిపారు. హైదరాబాద్ క్యూర్ ప్రాంతంలో ఎలక్ట్రిక్ వాహనాలపై పన్నులు తొలగించడంతో దేశంలో అత్యధికంగా ఇవిల స్వీకరణ పెరిగిందని ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణలోనే ఇవి తయారీ కోసం సంస్థలతో చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజా రవాణా వ్యవస్థను పర్యావరణహితంగా మార్చే దిశగా 2 లక్షలకుపైగా ఆటోరిక్షాలను రీట్రోఫిట్ చేస్తుండగా, 3,500 కంటే ఎక్కువ ఆర్టీసీ బస్సులను ఎలక్ట్రిక్ బస్సులుగా మారుస్తున్నామని చెప్పారు. హైదరాబాద్ మెట్రోను ప్రస్తుత 71 కి.మీ. నుంచి 200 కి.మీ. పైగా విస్తరించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. పరిశ్రమలను కోర్ అర్బన్ ప్రాంతం నుంచి పెరి అర్బన్ జోన్‌లకు తరలిస్తున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో భాగంగా మూసీ నది పునరుద్ధరణ, సరస్సులు, చెరువుల సంరక్షణ, వాటర్ గ్రిడ్, వనరుల నిర్వహణ ప్రణాళికలను ముఖ్యమంత్రి వివరించారు. హైడ్రా రూపంలో పర్యావరణ రక్షణకు ప్రత్యేక పోలీసు దళాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హైదరాబాద్‌లో వాతావరణ ప్రమాదాలను తగ్గించి నగరాన్ని సురక్షితమైన, వేగంగా అభివృద్ధి చెందే నగరంగా తీర్చిదిద్దుతామన్నారు. తెలంగాణను మొత్తం దేశానికి ఆదర్శంగా నిలబెట్టడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

# విద్య, ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యం

(మొదటిపేజీ తరువాయి)

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో మైనారిటీ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, రోడ్డు రవాణా, నీటిపారుదల శాఖ, సివిల్ సప్లయిస్, రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల బ్జడెట్ సమావేశాలు జరిగాయి. సమావేశాల్లో మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, అజారుద్దీన్ లతో కలిసి డిప్యూటీ సీఎం ప్రీ బ్జడెట్ సమావేశాలు నిర్వహించారు. మంత్రి అజారుద్దీన్ తో కలిసి మైనార్టీ సంక్షేమ శాఖ సమావేశంలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఆలోచించి, నిబద్ధతతో ప్రాధాన్యతను గుర్తించి, ఆదాయం ఖర్చుపై దృష్టి సారించి బ్జడెట్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు. సంక్షేమ శాఖకు సంబంధించి వసతి గృహాలు, గురుకులాల బిల్లులు ఎంత తొందరగా పంపితే అంత తొందరగా క్లియర్ చేస్తామని, వసతి గృహాల భవనాల మరమ్మత్తులు వేగంగా పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం మైనార్టీ సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నామని అన్ని వర్గాల విద్యార్థులు ఉమ్మడి కుటుంబంలా కలిసిపోవడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. విద్యార్థులు, టీచింగ్ స్టాఫ్ కు బయోమెట్రిక్ విధానం లేకపోతే వెంటనే అమలులోకి తీసుకురావాలని వాటిని కంట్రోల్ రూమ్ కు అనుసంధానం చేయాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. వసతి గృహాలు, రెసిడెన్షియల్ బిల్డింగ్ ల పైన సోలార్ పవర్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ తో సమావేశమై ఏర్పాటు చేసుకోవాలని కరెంటు భారం లేకుండా చేసుకోవడమే కాదు, సోలార్ ద్వారా ఆదాయం సృష్టించుకోవచ్చని తెలిపారు. ఈసారి బ్జడెట్ లో బీసీ లలో ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడానికి వారి ఆర్థిక వృద్ధి సాధించడానికి ప్రత్యేక పథకాలు ప్రారంభించాలని కోరడం జరిగిందనీ బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మహా లక్ష్మి ద్వారా ఆర్టీసీ లో



మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం విజయవంతంగా జరుగుతుంది. ప్రభుత్వం మహా లక్ష్మి నిధులు ఎప్పటికప్పుడు విడుదల చేస్తుంది. మహా లక్ష్మి కి ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్రంలో బస్సులు సంఖ్య కూడా గణనీయంగా పెంచడం జరుగుతుంది. త్వరలోనే ఆర్టీసీ లో ప్రయాణించే మహిళలకు మహా లక్ష్మి కార్డులను ప్రతి ఇంటింటా పండగల అందించడం జరుగుతుందనీ పోను ప్రభాకర్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు సివిల్స్, గ్రూప్స్ వంటి పోటీ పరీక్షల కోసం హైదరాబాద్ కు వచ్చి ఆర్థికంగా, ఇతరత్రా ఇబ్బందులు పడకుండా ఉండేందుకు నియోజకవర్గ కేంద్రాల్లో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లు ప్రారంభించే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని డిప్యూటీ సీఎం వివరించారు. దేశంలో, రాష్ట్రంలో అత్యుత్తమ ఉపాధ్యాయులను గుర్తించి హైదరాబాద్ నుంచి ఆ÷-లనైన్లో పాఠాలు బోధిస్తారని ఇది దేశంలోనే ఒక మోడల్ గా మారబోతుందని డిప్యూటీ సీఎం తెలిపారు. లోయర్ ట్యాంక్ బండ్, కాచిగూడ కేంద్రంలో ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉన్న విలువైన స్థలాల్లో భారీ బవంతులు నిర్మించి విద్యార్థులకు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు భవనాలు నిర్మించే ఆలోచనలు చేయాలని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు. ప్రతి మూడు నెలలకు మిస్ చార్జీలు, అ÷-దదెలు క్లియర్ చేయడం అభినందనీయమని అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు.



## అర్హులైన ప్రతి ఒక్కరికి
# ఇందిరమ్మ ఇళ్లు

(మొదటిపేజీ తరువాయి)

మొహమ్మద్ అజారుద్దీన్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపిక , రెండు పడకల గదుల ఇండ్లపై మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం పేదల ఇళ్ల మంజూరీలో పారదర్శకతగా వ్యవహరిస్తుందని అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించి అందించటమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఎల్ వన్ కింద 4800 మంది అర్హులైన ఇళ్ల స్థలాలు ఉన్న పేదలకు రెండు పడకల గదుల ఇల్లు నిర్మించుటకై నిధులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. అలాగే ఎల్ టు (ఒ2) కింద హైదరాబాద్ జిల్లాలో నాలుగు లక్షల ఇరవై రెండు వేలకు పైగా దరఖాస్తులు వివిధ నియోజకవర్గాల నుండి పేద ప్రజలు అందజేశారని మంత్రి వివరించారు. హైదరాబాద్ మహానగరంలో స్థలాలు సేకరించి జీ ప్లస్ 5-10 వరకు ఇందిరమ్మ ఇల్లు చేపట్టే ఆలోచనలో ప్రభుత్వం ఉందని మంత్రి వివరించారు.. పెండింగ్ లో ఉన్న 2 బిహెచ్‌కె ఇళ్ల పనులు పూర్తి చేసి అర్హులకు అందించాలని అధికారులకు సూచించారు.ఎక్కడెక్కడ ఖాళీలు ఉన్నాయి.. లబ్దిదారులు ఎంత మంది తదితర వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో 2 బిహెచ్‌కె లబ్దిదారులకు అందించమని ఇంకా పెండింగ్ పనులు పూర్తి చేసి లబ్దిదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మురికివాడల్లో ఇందిరమ్మ మోడల్ కాలనీలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి స్థలాల సేకరణ, అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణాలు పూర్తి, పూర్తయిన ఇండ్ల కేటాయింపు తదితర అంశాలపై శాసనసభ్యులతో కలిసి మంత్రులు సమీక్షించారు. తదుపరి హైదరాబాద్ జిల్లా పరిధిలోని నియోజకవర్గాల శాసనసభ్యుల అభిప్రాయాలను ఈ సందర్భంగా స్వీకరించి చేపట్టే అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, పిడి హౌసింగ్ అశోక్ చక్రవర్తి, ఆర్డీవోలు రామకృష్ణ, సాయిరాం హౌసింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ధరణి దోపిడిపై ఉక్కుపాదం

(మొదటిపేజీ తరువాయి)

ప్రయోజనాల కోసం వాడుకున్నారని మండిపడ్డారు. ధరణి పోర్టల్ లోని లొసుగులను ఆసరాగా చేసుకొని స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలను కొల్లగొట్టిన సంఘటనపై ఉన్నత స్థాయి కమిటీతో విచారణ జరిపించగా దిగ్భ్రాం÷-రతి కరమైన అనేక కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయని అన్నారు. ఇది సాధారణ సాంకేతిక లోపం కాదని వ్యవస్థాగతంగా సృష్టించిన లోపాల ఫలితమని స్పష్టం చేశారు. సచివాలయం లోని తన కార్యాలయంలో ఉన్నతస్థాయి కమిటీతో బుధవారం మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆనాడు ధరణి పోర్టల్ సెక్యూరిటీ ఆడిట్ చేసిన సమయంలో గుర్తించిన లోపాలను సరిదిద్దకుండానే అంతా సవ్యంగానే ఉన్నట్లుగా నివేదిక ఇచ్చారని అలాగే మానవ ప్రమేయంతో తప్పులు చేసే విధంగా పోర్టల్ ను రూపొందించారని , భూముల లావాదేవీలకు సంబంధించి అనుమానాస్పదంగా ఉన్న భూముల సమాచారం లభించకుండా లాగిన్‌లు డిలిట్ చేశారని, అత్యంత రహస్యంగా ఉండవలసిన లాగిన్ వివరాలు లేకుండా పోయాయని ఉన్నత స్థాయి కమిటీ విచారణలో ప్రాథమికంగా గుర్తించడం జరిగిందని తెలిపారు. నిబంధన లకు విరుద్ధంగా జరిగిన భూలావాదేవీల సమాచారం లభిం చకుండా చేశారని ,ఫోరెన్సిక్ ఆడిట్‌లో కోడ్ ఆడిట్ నిర్వహించలేదన్న విషయం బహిర్గతమైందని, ఈ నేపథ్యంలో తక్షణమే ధరణి పోర్టల్ పై కోడ్ ఆడిట్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ధరణి పోర్టల్ నిర్వహణా బాధ్యతను టెర్రాసిస్ అనే విదేశీ సంస్థకు అప్పగించడం వల్లే సమస్యలు ఎదురవుతున్నాయని గుర్తించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారి సూచనల మేరకు ధరణి లోపాలను అడ్డుపెట్టుకొని ప్రభుత్వానికి రావలసిన స్టాంప్‌డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలను కొల్లగొట్టిన వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తా మని, తప్పుచేసినవారు ఎవరినైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని, ప్రభుత్వానికి రావలసిన ప్రతిపైసాను వసూలు చేస్తామన్నారు. దీనిపై ఉన్నత స్థాయి కమిటీ ఇచ్చిన నివేదికను పరిగణనలోకి తీసుకొని భవిష్యత్తులో అలాంటి పొరపాట్లు జరగకుండా ఏ చిన్న లోపానికి తావులేకుండా అధికారుల ప్రమేయానికి ఆస్కారం లేకుండా ప్రజలకు ఫ్రెండ్లీగా ఉండేలా భూభారతి పోర్టల్ ను నిర్వహించాలని అధికారులకు సూచించారు. ప్రజల భూముల విషయంలో ఎటువంటి రాజీ పడబోమని, ధరణి పేరుతో జరిగిన ప్రతి అక్రమాన్ని వెలికితీస్తామని, సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల్లో నిర్వహించిన విధంగానే మిగిలిన జిల్లాల్లో ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహణకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్ , సిఎం ఆర్ వో మందా మకరంద్, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంత్, ఉన్నత స్థాయి కమిటీ సభ్యులు స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ డిఐజి సుభాష్, ఎస్‌బి ఎస్పీ సింధు శర్మ, సైబర్‌క్రైమ్ డిఎస్పీ ఎ. సంపత్, హోంశాఖ సలహాదారు పి. శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విడాకులు ఇచ్చిందన్న కోపంతో..
# మాజీ భార్య హత్య

(మొదటిపేజీ తరువాయి)

కొన్ని రోజుల క్రితమే మహేష్‌కు విడాకులు ఇచ్చి రెండో వివాహం చేసుకుంది. దీంతో మాజీ భర్త లేపేసేందుకు ప్లాన్ వేశాడు. దీంతో తాజాగా మహేష్ రెండు కత్తులు, పెట్రోల్ డబ్బాతో సునీత ఇంట్లోకి చొరబడ్డాడు. ముందుగా ఆమెతో వాగ్వాదానికి దిగాడు. అనంతరం కత్తులతో తీవ్రంగా గాయపరిచాడు. పూలకుండీతో తలపై బలంగా కొట్టి హత్య చేశాడు. సునీత రక్తపు మడుగులో పడిఉండగా, మహేష్ అక్కడి నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించినట్టు తెలుస్తోంది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. పరారీలో ఉన్న మహేష్‌ను కొద్ది గంటల్లోనే పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. విడాకులు తీసుకుని మరో వివాహం చేసుకోవడాన్ని సహించలేకపోయిన మహేష్ ఈ హత్యకు పాల్పడ్డాడని పోలీసులు అనుమానిస్తున్నారు.

## 3 ట్రిలియన్ డాలర్ల లక్ష్య సాధనలో

# కీలకంగా లైఫ్ సైన్సెస్

- దేశ జీడీపీలో మన వాటాను 10 శాతానికి పెంచేందుకే
- తెలంగాణ రైజింగ్ 2047'కు శ్రీకారం
- బయో ఏషియా 2026 ముగింపు వేడుకలో మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్, ఫిబ్రవరి 18 :** తెలంగాణను గ్లోబల్ లైఫ్ సైన్సెస్ పవర్‌హౌస్‌గా మార్చాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని, ఆ దిశగా చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. లైఫ్ సైన్సెస్ రంగంలో కేవలం రెండేళ్లలోనే రూ. 73,360 కోట్ల పెట్టుబడులు ఆకర్షించి, లక్ష ఉద్యోగాలను సృష్టించామని వివరించారు. బుధవారం హైటెక్స్ లో 'బయో ఏషియా 2026' సదస్సులో భాగంగా 'తెలంగాణ రైజింగ్ 2047: బిల్డింగ్ ఏ వరల్డ్ క్లాస్ లైఫ్ సైన్సెస్ ఎకో సిస్టం' పేరిట నిర్వహించిన ముగింపు వేడుకలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.... దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలనే లక్ష్యంతోనే ప్రజలు, నిపుణుల భాగస్వామ్యంతో 'తెలంగాణ రైజింగ్ 2047'కు శ్రీకారం చుట్టామన్నారు. 2047 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలనే లక్ష్య సాధనలో కీలక పాత్ర పోషించేలా లైఫ్ సైన్సెస్ రంగం ఎకో సిస్టంను మరింత బలోపేతం చేసేందుకు సమగ్ర ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నా మన్నారు. అందులో భాగంగానే.... తెలంగాణ నెక్స్ట్ – జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ తెలంగాణ లైఫ్ సైన్సెస్ స్కూల్, 1బయో ఇంక్యుబేటర్, జీనోమ్ వ్యాలీ విస్తరణ, ఫార్మా విలేజెస్, తెలంగాణ లైఫ్ సైన్సెస్ ను మరింత బలోపేతం చేసేందుకుప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, అంతర్జాతీయ భాగస్వామ్యం, నైపుణ్యం కలిగిన మానవ వనరుల తయారీకి శ్రీకారం చుట్టామన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 2,000కు పైగా లైఫ్ సైన్సెస్ సంస్థలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని, జాతీయ ఫార్మా ఉత్పత్తుల్లో మూడో వంతు, ఎగుమతుల్లో అయిదో వంతు వాటా తెలంగాణదే కావడం మనకు గర్వకారణమన్నారు. ఈ ఏడాది సదస్సులో సనోఫీ, ఒపెల్లా , వ్యాక్సిండో యానిమల్ హెల్త్, ట్రైడెన్స్, ఆర్ఎక్స్ ప్రొపె÷–లలెంట్ వంటి దిగ్గజ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు ముందుకొచ్చాయన్నారు. బ్రిటన్, న్యూజిలాండ్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, జపాన్, యూకే తదితర దేశాల నిపుణులతో లైఫ్ సైన్సెస్ రంగంలో రాబోయే రోజుల్లో ఎదురయ్యే సవాళ్లు, అనుసరించాల్సిన వ్యూహాలపై నిర్వహించిన ప్రత్యేక రౌండ్ టేబుల్ సమావేశాలు తెలంగాణ బ్రాండ్ ను మరింత విశ్వవ్యాప్తం అయ్యేందుకు దోహదం చేస్తాయన్నారు. 'బయో ఎకానమీ' రంగంలో మూడో అతిపెద్ద శక్తిగా ఎదగడానికి భారత్ కు ఉన్న అవకాశాలు, తెలంగాణ పాత్రపై చర్చించి... ప్రత్యేక కాంప్రహెన్సివ్ రోడ్ మ్యాప్ ను సిద్ధం చేసేందుకు వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్‌తో కలిసి ప్రత్యేక చర్చా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఈసారి ఫార్చ్యూన్ 500 కంపెనీల ప్రతినిధులతో పాటు దేశ విదేశాల నుంచి మొత్తం 4,394 మంది ప్రతినిధులు హాజరయ్యారన్నారు. కొత్త పెట్టుబడులు, భాగస్వామ్యాల కోసం 4వేలకు పైగా అత్యున్నత స్థాయి బిజినెస్ టూ బిజినెస్ సమావేశాలకు ఈ ఏడాది సదస్సు వేదికగా నిలిచిందన్నారు. లైఫ్ సైన్సెస్ రంగాన్ని తమ ప్రభుత్వం కేవలం వ్యాపారంగా మాత్రమే చూడటం లేదని, ఒక సామాజిక బాధ్యతగా చూస్తున్నామన్నారు. అన్ని రకాలుగా పారిశ్రామికాభివృద్ధికి అనుకూలంగా ఉన్న రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి రైజింగ్ తెలంగాణలో భాగస్వామ్యం కావాలని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు పారిశ్రామికవేత్తలకు విజ్ఞప్తి చేశారు.



## రాష్ట్రంలో డేటా సెంటర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు

**అధికారులను ఆదేశించిన సిఎస్ రామకృష్ణారావు**

**హైదరాబాద్, ఫిబ్రవరి 18 :** రాష్ట్రంలో డేటా సెంటర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. ఈ మేరకు సచివాలయంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఐ.టి, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ కమిషనర్ శశాంక, ఐటి శాఖ ప్రత్యేక కార్యదర్శి భవేష్ మిశ్రా ఇతర సీనియర్ అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సి.ఎస్ రామకృష్ణా రావు మాట్లాడుతూ, రాష్ట్రంలో డేటా సెంటర్ల ఏర్పాటుకు ముందుకు వచ్చే సంస్థలకు పూర్తి స్థాయిలో తగు ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేసారు. ఇప్పటికే, రాష్ట్ర ముఖ్యమంత్రి గారు పలు మార్లు డేటా సెంటర్ల ఏర్పాటుపై సమీక్ష సమావేశాలను ఏర్పాటు చేశారని అన్నారు. డేటా కేంద్రాల ఏర్పాటుకు పొరుగు రాష్ట్రాలను మహారాష్ట్ర, ఆంధ్ర ప్రదేశ్ లతో పాటు ఉత్తరప్రదేశ్ లలో ఇస్తున్న రాయితీలపై చర్చించారు. డాటా సెంటర్ల ఏర్పాటుకు 100 శాతం గ్రీన్ ఎనర్జీ సోర్స్ సౌకర్యం, కావాల్సిన విద్యుత్ ను బహిరంగ సేకరణ ద్వారా పొందడం, డెడికేటెడ్ పవర్ సప్లై నెట్వర్క్ ఎస్.జి.ఎస్.టి రీ–ఇంబర్సుమెంట్ తదితర అభ్యర్థనలు డేటా సెంటర్ల ఇన్వెస్టర్లు కోరుతున్నందున, ఈ అంశాలపై అధ్యయనం చేయాలని సి.ఎస్ సూచించారు. ఈ డేటా సెంటర్ల ఏర్పాటుతో రాష్ట్రం లో పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలతో పాటు అనుబంధ రంగాలు కూడా అభివృద్ధి చెందుతాయని అన్నారు.

## బాల్క సుమన్ అరెస్టు దుర్మార్గం

- కాంగ్రెస్ అక్రమాలను ఎదిరించినందుకు అరెస్టా?
- మండిపడ్డ మాజీమంత్రి హరీష్ రావు



**హైదరాబాద్, ఫిబ్రవరి 18 :** క్యాతనపల్లిలో కాంగ్రెస్ అప్రజాస్వామిక, అహంకార చర్యలను అడ్డుకున్నందుకు మాజీ శాసనసభ్యులు, దళిత నాయకుడు బాల్క సుమన్ ను అరెస్టు చేసి నిర్బంధించడాన్ని మాజీ మంత్రి హరీష్‌రావు తీవ్రంగా ఖండించారు. క్యాతన్ పల్లిలో బీఆర్ఎస్ పార్టీకి పూర్తి మెజారిటీ వచ్చినా కూడా కాంగ్రెస్ పార్టీ పట్టపగలు ప్రజాస్వామ్యాన్ని పరిహసించిన తీరు చూసి యావత్ తెలంగాణ అసహ్యించుకుంటున్నదని అన్నారు. అధికార బలం, పోలీసు బలం, ధన బలంతో చట్టాలను తుంగలో తొక్కడం కాంగ్రెస్ అరాచక వైఖరికి పరాకాష్ట అని దుయ్యబట్టారు. రాష్ట్రమంతా కాంగ్రెస్ మార్కు గూండాగిరి రాజ్యమేలుతున్నది. మున్సిపల్ ఎన్నికల వేళ కాంగ్రెస్ మురుగు రాజకీయాల వాసన కమ్ముకున్నది. హంగ్ వచ్చిన చోటల్లా ప్రతిపక్ష నాయకులను సంత భేరం చేస్తూ, కిడ్నాపులకు తెగబడుతూ ప్రజా తీర్పును కాలరాస్తున్న తీరుకు నిదర్శనాలు ఎన్నోనని అన్నారు. జనగాంలో దళిత మహిళా కౌన్సిలర్ బీఆర్ఎస్‌కు మద్దతుగా చెయ్యి ఎత్తితే రిటర్నింగ్ ఆఫీసర్ సాక్షిగా కాంగ్రెస్ గూండాలు చేసిన దాడిని సమాజం కళ్లారా చూసిందని వెల్లడించారు. తమ కళ్ళెదుట ఒక దళిత మహిళా నాయకురాలిపై కాంగ్రెస్ నాయకులు దాడికి తెగబడితే అధికారులు, పోలీసులు కళ్లప్పగించి చోద్యం చూశారే తప్ప అడ్డుకోలేదని అన్నారు. ఒక్క క్యాతనపల్లే కాదు తొర్రూరు, జనగాం, ఇబ్రహీంపట్నం, జహీరాబాద్ సహా హంగ్ వచ్చిన ప్రతి చోటా ప్రజా తీర్పును గౌరవించకుండా చైర్మన్ పీఠాలను అడ్డదారుల్లో దక్కించుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్రంలో భూములను కబ్జా చేసినట్లే, రాజకీయ పీఠాలను కూడా కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. బాల్క సుమన్ ను భేషరతుగా విడుదల చేయాలని, ప్రజాస్వామిక వాతావరణంలో క్యాతన్ పల్లి చైర్మన్ ఎన్నిక జరిగేలా బాధ్యత వహించాలని ఎన్నికల కమిషన్ ను డిమాండ్ చేశారు.

## అసలు సమస్య బాల్క సుమనే

- తమపై దాడి చేసి కారు అద్దాలు ధ్వంసం
- కోరం లేకనే చైర్మన్ ఎన్నిక వాయిదా
- మంత్రి వివేక్ వెంకటస్వామి వివరణ



**మంచిర్యాల, ఫిబ్రవరి 18 :** బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ తీరుపై తెలంగాణ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమన్ తమపై దాడి చేసి కారు అద్దాలు ధ్వంసం చేశారని ధ్వజమెత్తారు. ఇదేం పద్ధతని.. ఈ విషయంలో బాల్క సుమన్‌ని హరీశ్‌రావు సమర్థిస్తారా అని ప్రశ్నించారు. బుధవారం క్యాతనపల్లిలో మీడియాతో మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడారు. క్యాతనప్లలెలో ఎలాంటి సమస్య లేదని స్పష్టం చేశారు. సుమన్ దౌర్జన్యం అందరూ చూశారన్నారు. సుమన్ ఆరోపణలన్నీ అబద్ధాలేనని మండిపడ్డారు. ఆయన రెచ్చగొట్టి డ్రామాలు చేస్తున్నారని ఆగ్రహించారు. మొదటిరోజు కోరం లేకపోవడంతో క్యాతనపల్లిలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎంపికని వాయిదా వేశామని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. రెండోరోజు బయటి వాళ్లు వచ్చి గొడవ చేశారని చెప్పుకొచ్చారు. అనవసర గొడవ కారణంగా రెండోరోజు వాయిదా పడిందని అన్నారు. ఎన్నిక ప్రాసెస్‌ను తాము అడ్డుకోలేదని స్పష్టం చేశారు. బాల్కసుమన్ తమ మీద రాళ్లు విసిరారని, దాడి చేశారని ఆరోపణలు చేశారు. రెండురోజులుగా సుమన్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. కేసీఆర్ హయాంలో చెన్నూరు, క్యాతనప్లలెలో సరిగా ఎన్నికలు జరగలేదని, గుండాయిజంతో మున్సిపల్ ఎన్నికలు ఏకగ్రీవం చేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో అధికార దుర్వినియోగం చేశారని విమర్శించారు. బీఆర్ఎస్ నేతలు క్యాంపు పెట్టుకుంటే ఎక్కడైనా తాము గొడవ చేశామా అని మంత్రి వివేక్ వెంకటస్వామి ప్రశ్నల వర్షం కురిపించారు. తాము ఎలాంటి అధికార దుర్వినియోగం చేయలేదని తేల్చిచెప్పారు. మంత్రి, ఎంపీ కార్లపై రాళ్లు విసరడం సరైనదైనా అని నిలదీశారు. తమపై దాడిని ఖండిస్తున్నామని అన్నారు. బీఆర్ఎస్ నేతలు ఇంకా అధికారంలో ఉన్నట్లుగా వ్యవహరిస్తున్నారని ఫైర్ అయ్యారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఓడిపోయినా బాధలో బాల్కసుమన్ తమపై ఫ్రస్టేషన్ చూపుతున్నారన్ని ÷ర్ అయ్యారు. హరీశ్‌రావుకు ప్రజాస్వామ్యంపై గౌరవం ఉంటే సుమన్ తమపై చేసిన దాడిని ఖండించాలని అన్నారు. తాము చెన్నూరులో ఏరోజు బీఆర్ఎస్‌పై దాడి చేయలేదని... ఎవరినీ అరెస్ట్ చేయలేదని మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు.

## రంజాన్ మత సామరస్యానికి ప్రతీక

**శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్, ఫిబ్రవరి 18 :** పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమైన సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముస్లిం సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పవిత్ర మాసంలో ముస్లింలు ఆచరించే ఉపవాస దీక్షలు, ప్రార్థనలు ఆధ్యాత్మికతను పెంపొందించడంతో పాటు క్రమశిక్షణను పెంచుతాయన్నారు. లౌకికవాదం, మత సామరస్య పరిరక్షణలో తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని సీఎం అన్నారు. ముస్లిం సోదరులు రంజాన్ మాసం సంతోషంగా జరుపుకొని, అల్లా దీవెనలు పొందాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

## అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు

- ఆన్‌లైన్ ద్వారా నమోదు ప్రక్రియ ప్రారంభం
- స్పెషల్ కమిషనర్ ప్రయాంక వెల్లడి

**హైదరాబాద్, ఫిబ్రవరి 18 :** రాష్ట్రంలోని అర్హులైన జర్నలిస్టులందరికీ జి ఓ ఎం ఎస్ నెం. 252 ప్రకారం అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయడం జరుగుతుందని సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సిహెచ్.ప్రియాంక ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్, ఫ్రీ ల్యాన్సర్ మరియు వెటరన్ జర్నలిస్టులు అక్రిడిటేషన్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి సమాచార శాఖ ప్రత్యేక వెబ్ సైట్ ను రూపొందించామన్నారు. సమాచారశాఖ వెబ్ సైట్ లో ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 9వ తేదీ నుండి దరఖాస్తు లను ఆన్‌లైన్‌లో తీసుకోవడం జరుగుతుందన్నారు. అక్రిడిటేషన్ దరఖాస్తు మరియు జారీ పక్రియ నిరంతరం కొనసాగుతుందని, దరఖాస్తు చేసుకునే సమయంలో ఏదైన టెక్నికల్ సమస్యలు ఉత్పన్నమైతే సమాచార శాఖ మీడియా రిలేషన్ విభాగంలో ఈ నెంబర్ 9154170881కు కార్యాలయం పని వేళలో ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటలలో సంప్రదించవచ్చునని ఆమె ఆ ప్రకటనలో తెలిపారు.

## రాజేంద్రనగర్ లక్ష్మిగూడలో చదరపు గజం రూ.51 వేలు

- హౌసింగ్ బోర్డు ఓపెన్ ప్లాట్ల విక్రయానికి మంచి స్పందన
- హాట్ కేకుల్లా అమ్ముడైన 14 ప్లాట్లు
- హౌసింగ్ బోర్డుకు రూ.14.75 కోట్ల ఆదాయం

**హైదరాబాద్, ఫిబ్రవరి 18 :** రాజేంద్రనగర్ మండలంలోని లక్ష్మిగూడలోని హౌసింగ్ బోర్డు ఓపెన్ ప్లాట్ల విక్రయానికి మంచి స్పందన లభించింది. ఇక్కడి 14 ప్లాట్లను బహిరంగ వేలం ద్వారా విక్రయించడానికి హౌసింగ్ బోర్డు ఈ నెల 2 వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేశారు. కాగా బుధవారం నాడు నిర్వహించిన వేలం పాటలో 49 మంది కొనుగోలుదారులు పాల్గొనగా ప్లాట్లన్నీ హాట్ కేకుల్లా అమ్ముడు పోయాయి. ఈ భూముల చదరపు గజానికి రూ. 32 వేల ను కనీస ధరగా నిర్ధారించగా, వేలం పాటలో గరిష్టంగా చదరపు గజం రూ.51 వేలకు కొనుగోలు చేశారని హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ విపి గౌతం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ 14 ప్లాట్ల విక్రయాల ద్వారా హౌసింగ్ బోర్డుకు రూ.14.75 కోట్ల మేర ఆదాయం వచ్చిందని ఆయన వివరించారు. హోసింగ్ బోర్డు సౌత్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆధ్వర్యంలో పారదర్శకంగా నిర్వహించిన ఈ భూముల విక్రయాల్లో అతి తక్కువగా చదరపు గజానికి రూ.36 వేల ధర పలకగా, సగటున చదరపు గజం భూమి రూ. 44,285 ధర పలికింది.

## అట్రాసిటీ బాధితులకు ఇళ్ల పంపిణీ

**ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నేరాలపై మంత్రి అడ్లూరి సమీక్ష**



**హైదరాబాద్, ఫిబ్రవరి 18 :** ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ బాధితులకు మంత్రి అడ్లూరి. లక్ష్మణ కుమార్ ఇళ్ల ను పంపిణి చేశారు. ఈ కార్యక్రమం మల్కాజ్గిరి జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగింది. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక నేరాలపై సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ, గిరిజన శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాధితులకు మంత్రి డబల్ బెడ్ రూమ్ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేయడం జరిగింది. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారం బాధితులకు దళిత, బడుగు, బలహీన వర్గాలకు అన్యాయం జరిగినప్పుడు, న్యాయం జరిగే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చట్టబద్ధంగా వ్యవహరిస్తూ వారికి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం బాసటగా నిలుస్తుందని మంత్రి శ్రీ లక్ష్మణ్ అన్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ బాధితులకు తగు న్యాయం చేసేలా చొరవ తీసుకోవాలని మంత్రి కోరారు. అనుకోకుండా దురదృష్టవశాత్తు కొన్ని సంఘటనలు జరిగినప్పుడు, బాధితులకు అండగా నిలవాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే అని అన్నారు. కేవలం డబుల్ బెడ్ రూమ్ లతో కాకుండా సంక్షేమ శాఖ ద్వారా బాధితులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు రుణాలతో పాటు ఇతర సహాయం, సబ్సిడీ పరంగా అందించేందుకు, జీవనోపాధి కల్పించే విధంగా జిల్లా కలెక్టర్ లు చొరవ తీసుకోవాలని మంత్రి ఆదేశాలు ఇచ్చారు. బాధితులకు ఎలాంటి ఆలస్యం జరగకుండా టైం బౌండ్ ప్రోగ్రాం రూపొందించుకొని వారికి న్యాయం చేయాలని ఆదేశించారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు పక్కదారి పట్టకుండా బాధితులకు న్యాయం చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అవమానం నష్టం జరిగిన బాధితులకు పిసిఆర్ పిఓఏ ఆక్ట్ చట్టం ప్రకారం న్యాయం చేయాలన్నారు. ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు బాధితుల పక్షాన నిరంతరం వారికి సహాయ, సహకారాలు అందిస్తున్నారని మంత్రి కొనియాడారు. ఎస్సీ ఎస్టీలపై ఎలాంటి దాడులు గాని ఇబ్బందికరమైన పరిస్థితులు ఏర్పడితే, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులకు ఆదేశించారు. అడ్వాన్స్ టెక్నాలజీని ఉపయోగించి వాస్తవంగా నష్టపోయిన వారికి వీలైనంత త్వరగా న్యాయం చేసే విధంగా చర్యలు చేపట్టాలని మంత్రి అడ్లూరి ఆదేశించారు. చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన కోరారు. ఎస్సీ ఎస్టీలకు ఎలాంటి నష్టం ఇబ్బంది కలిగిన తాను ఎల్లప్పుడూ అండగా మంత్రి భరోసా ఇచ్చారు. ఇదిలా ఉండగా 194 మంది ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ బాధితులకు 30 లక్షల విలువగల ఇళ్లను మంత్రి చేతుల మీదుగా బాధపెట్లకు అందజేయడం జరిగింది. ఎస్సి ఎస్టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, తెలంగాణ సాంస్కృతిక సారథి గుమ్మడి వెన్నెల, కమిషనర్ ఆఫ్ పోలీస్ మల్కాజ్గిరి అవినాష్ మహంతి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ చౌదరి, ఉప్పల్ జోన్ డిప్యూటీ కమిషనర్ సురేష్ కుమార్, మల్కాజ్గిరి జోన్ డిప్యూటీ కమిషనర్ సిహెచ్ శ్రీధర్, ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు జిల్లా శంకర్, రాంబాబు నాయక్, ఎన్జీవో బిట్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## పురపాలక ఎన్నికల్లో 61శాతం బీసీలు గెలుపు

**తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్**

**హైదరాబాద్, ఫిబ్రవరి 18 :** రాష్ట్రంలో జరిగిన పురపాలక ఎన్నికల్లో బీసీలు మొత్తంగా 61శాతంనకు పైగా గెలవటం పట్ల బీసీ కమిషన్ ఛైర్మన్ జి.నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి, హర్షం వ్యక్తం చేశారు. ఈ మధ్య జరిగిన పంచాయితీ ఎన్నికల్లో జనరల్ స్థానాలలో కూడా బీసీ అభ్యర్థులు 52.75 శాతం గెలిచిన విషయం విదితమే. మున్సిపల్ ఎన్నికల్లో, మున్సిపల్ వార్డులలో బీసీలకు 28.22శాతం , మున్సిపల్ కార్పోరేషన్‌లలో మొత్తం వార్డులలో 35.25శాతం బీసీలకు కేటాయించినా జనరల్ స్థానాలలో కూడా బీసీలు గెలిచి, మొత్తం మీద 61శాతం గెలవటం బీసీ వర్గాల ప్రజలలో పెరిగిన చైతన్యానికి నిదర్శనం అని పేర్కొన్నారు. రాబోయే జెడ్‌పిటిసి, ఎంపిటిసి, జిహెచ్ఎంసి, కార్పొరేషన్ల ఎన్నికల్లో కూడా బీసీలు అత్యధికంగా గెలుస్తారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. సమగ్ర సర్వేలో బీసీల సంఖ్య 56.33శాతం అని తేలగా, రాష్ట్ర ప్రభుత్వం 42శాతం బీసీలకు రిజర్వేషన్ కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లు పాస్ చేసినా అది ఇంకా కేంద్ర ప్రభుత్వంలో పెడ్డింగ్‌లో ఉండటం, కొందరు కోర్టు కెళ్లి ఈ రిజర్వేషన్ అమలు కాకుండా చేయడం సముచితం కాదు. పంచాయతీ ఎన్నికల్లో, ఇప్పుడు జరిగిన పురపాలక ఎన్నికల్లో బీసీలు గెలిచిన స్థానాలను దష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం 42శాతం రిజర్వేషన్లకు అమలు చేయడానికి అనుమతినివ్వాలని, 9వ షెడ్యూల్‌లో పెట్టాలని, అదేవిధంగా కోర్టుల్లో కేసులు వేసిన వారు కూడా వారి కేసులను ఉపసంహరించి చట్టబద్ధంగా బీసీల రిజర్వేషన్లు సాకారమయ్యే మార్గం సుగమం చేయాలని బీసీ కమిషన్ కోరుకుంటుంది.

## తాగుబోతు భర్తను హత్య చేసిన భార్య

**హైదరాబాద్, ఫిబ్రవరి 18 :** హైదరాబాద్ పాతబస్తీలో దారుణం జరిగింది. కట్టుకున్న భర్తను భార్య దారుణంగా హత్య చేసింది . పాతబస్తీ భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. మృతుడు మహమ్మద్ ఇషాక్‌గా పోలీసులు గుర్తించారు. అతడు ఆటోనడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇషాక్ మద్యానికి బానిసవడంతో దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతూ ఉండేవని కుటుంబసభ్యులు తెలిపారు. ఈ క్రమంలోనే గత రాత్రి కూడా ఇరువురి మధ్య వాగ్వివాదం చెలరేగినట్లు తెలుస్తోంది. దీతో, మద్యం సేవించి రోజూ గొడవపడుతున్న భర్తను నిద్రలో ఉండగానే చున్నీతో గొంతు బిగించి హత్య చేసింది భార్య నూర్జహాన్ బేగం. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

## మక్తల్‌లో 20 నుంచి 24 వరకు సీఎం కప్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

**పోటీల ఏర్పాట్లపై అధికారులతో మంత్రి వాకిటి శ్రీహరి టెలికాన్ఫరెన్స్**

**హైదరాబాద్, ఫిబ్రవరి 18 :** మక్తల్‌లో సీఎం కప్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను జాతరలా నిర్వహించాలని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. మక్తల్‌లో ఈనెల 20 నుంచి 24 వరకు నిర్వహించే కబడ్డీ పోటీల నిర్వహణపై ప్రజాప్రతినిధులు, జిల్లా అడిషనల్ కలెక్టర్, జిల్లా ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎం కప్–2026లో భాగంగా మక్తల్ పట్టణంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నామని, వీటిని ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని మంత్రి వాకిటి శ్రీహరి సూచించారు. కబడ్డీ నిర్వహణ ఏర్పాట్లపై అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయం చేసుకోవాలని మంత్రి దిశానిర్ధేశర చేశారు. ఈనెల 20 నుంచి 24 వరకు కబడ్డీ పోటీలు జరగనుండటంతో అందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను అధికారులు సీరియస్‌గా తీసుకోని పనిచేయాలని ఆదేశించారు. మక్తల్ లో నిర్వహించే కబడ్డీ పోటీలు ఇతర రాష్ట్రాలకు దిక్సూచిగా నిలిచేలా నిర్వహణ ఉండాలని అభిప్రాయపడ్డారు. అందుకోసం అతిథ్యం, స్టేడియం, ఇతర ఏర్పాట్లపై దృష్టి సారించాలని అధికారులకు మంత్రి వాకిటి శ్రీహరి సూచించారు. ఈ కబడ్డీ పోటీల్లో పాల్గొనేందుకు 33 జిల్లాలనుంచి క్రీడాకారులు రానుండటంతో అన్ని ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత మనపై ఉందని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. క్రీడల్లో పాల్గొనేందుకు వచ్చే వారికి వసతులు తదితర అంశాల్లో ఎలాంటి అసౌకర్యం కలుగుకుండా చూసుకోవాలని తెలిపారు. క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల విద్యార్థులను కబడ్డీ పోటీల్లో భాగస్వాములను చేయాలని విద్యాశాఖ అధికారులను మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశించారు. ఈ కబడ్డీ పోటీలకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు అతిథులుగా హాజరవుతున్నారని, వారందరిని గౌరవించుకోవాలని సూచించారు. పోలీస్, స్పోర్ట్స్, శానిటరీ, మున్సిపల్, విద్యుత్ అధికారులు ఎప్పటికప్పుడూ జిల్లా ఉన్నతాధికారులతో సమన్వయం చేసుకుంటూ కబడ్డీ పోటీలను విజయవంతానికి కృషిచేయాలని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. ప్రజాప్రతినిధులు కూడా కబడ్డీ పోటీలను సవాల్‌గా తీసుకోని అధికారులతో కలిసి ముందుకుపోవాలని మంత్రి చెప్పారు. ఈ టెలికాన్ఫరెన్స్ లో జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా ఉన్నతాధికారులు, జిల్లా క్రీడల అధికారి, విద్యుత్, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపీడీవో అధికారులు, మున్సిపల్ చైర్మన్ వాకిటి మానస హన్మంతులు పాల్గొన్నారు.

# గ్రామ, పట్టణాల అభివృద్ధి లక్ష్యం కావాలి!



**గ్రామాలు, పట్టణాల ఎన్నికలు పూర్తిక ఆవడంతో ఇక అభివృద్ధిపై దృష్టి పెట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి సాగించే బాధ్యత సిఎం రేవంత్‌పై ఉంది. ఎన్నికల్లో ఎన్ని రాజకీయాలు చేసినా, అభివృద్ధి విషయంలో సమన్వయంతో అందరినీ కలుపుకుని పోవాల్సి ఉంటుంది. రానున్నది వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగాల్సి ఉంది. మంచినీరు, పారిశుద్యం లాంటి సమస్యలు రాజ్యమేలుతున్నాయి. గ్రామస్థాయిలో అవినీతి విపరీతంగా ఉంది. పంచాయితీ వ్యవహారాలను, మున్సిపల్ వ్యవహారాలను పారదర్శకంగా సాగించాలి. పూర్తిస్థాయి కంప్యూటీకరణతో పనులను వేగంగా జరిగేలా చూడాలి. ఎందుకంటే అవినీతిరహిత, పారదర్శక పాలన అన్నది గ్రామాల నుంచే ప్రారంభం కావాలి.**

మున్సిపాలిటీల్లో కూడా పారదర్శక విధానాలకు పెద్దపీట వేయాలి. మంచినీరు, పారిశుధ్య పనులకు ప్రాధాన్యం ఇవ్వాలి. నిధుల విడుదలలో కూడా రాజకీయాలు లేకుండా చూడాలి. గ్రామాభివృద్ధిలో సర్పంచ్ ల పాత్ర అత్యంత కీలకం. నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లకు, మున్సిపల్ ఛైర్మన్లకు పాలనా పరమైన అవగాహన కల్పించాలి. ఇప్పటికే పంచాయతీల సర్పంచ్‌లకు విడతల వారీగా శిక్షణ అందిస్తున్నారు. మున్సిపల్ ఛైర్మన్లకు, వైఎస్ ఛైర్మన్లకు కూడా శిక్షణ అందించాలని సిఎం నిర్ణయించారు. అందువల్ల పాలనా పరంగా ప్రజలకు సేవ చేసేలా శిక్షణ ఇవ్వాలి. చేయిచాపే విధానాలకు స్వస్తిపలకాలి. ఈ విషయంలో వారికి కఠినమైన ఆదేశాలు ఇవ్వాలి. పంచాయతీరాజ్ చట్టం, గ్రామాభివృద్ధి కార్యక్రమాల అమలు విధానం, ఆర్థిక నిర్వహణ, సామాజిక బాధ్యతలు, పారదర్శక పాలన అంశాలపై సవివరంగా మార్గనిర్దేశం చేస్తున్నారు. సర్పంచ్‌లు గ్రామంలో జరుగుతున్న ప్రతీ అభివృద్ధి కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలని సూచించారు. ఇకపోతే కొత్తగా కొలువుదీరిన మున్సిపల్ పాలకవర్గాలకు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. ఇచ్చిన హామీలను నెరవేర్చడం సవాల్‌గా మారనుంది. పట్టణాల్లో ముఖ్యంగా పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. పట్టణాల్లో రోడ్లు, డ్రైనేజీలు కంపుకొడుతున్నాయి. అనేక వార్డుల్లో తాగునీటి సమస్యల నెలకొన్నది. విలీన గ్రామాలు, శివారు పల్లెల్లో కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాయి.

మున్సిపాలిటీల్లో పాలన గాడి తప్పింది. మౌలిక సదుపాయాలను కల్పించడంలో అధికార యంత్రాంగం ఘోరంగా విఫలమైంది. మరోపక్క పట్టణాలో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. అనుమతులు లేకుండా నిర్మాణాలను చేపడుతున్నా, పట్టణ ప్రణాళికశాఖ అడ్డుకోలేకపోతున్నది. పట్టణంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరైనా, పనులు ప్రారంభంకాక పోవటంతో అభివృద్ధికి నోచుకోవడంలేదు. మరోపక్క పారిశుద్ధ్య నిర్వహణ పనులు సక్రమంగా చేపట్టడం లేదు. ఇన్ని సమస్యలు, సవాళ్ల మధ్య కొత్త పాలకవర్గం బోధన్ మున్సిపాలిటీలో పాలనా పగ్గాలు చేపట్టింది. వీధి కుక్కల బెడద గ్రామాలు మొదలు, పట్టణ్యాల వరకు ఉంది. కోతుల సమస్య అత్యంత దారుణంగా ఉంది. వీటి నివారణకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. లేకుంటే ఇదో పెద్ద సమస్యలగా పరిణమించడం ఖాయం. దోమలు విజృంభిస్తున్నాయి. దీనికితోడు అంటువ్యాధుల బెడద ఉంది. మిషన్ భగీరథ పేరుతో ఊదరగొట్టినా పాత మంచినీటి పథకాలకే కొత్తగా పేరు పెట్టారు. ఎక్కడా సక్రమంగా మంచినీటి వ్యవస్థ లేకుండా పోయింది. తాగునీటి సమస్య తీవ్రంగా ఉండడంతో పలు పట్టణాల్లో కొత్తగా వెలసిన శివారు కాలనీలకు తాగునీరు అందడంలేదు. తరచుగా తాగునీటి పైప్‌లైన్లు పగిలిపోతున్నాయి. తాగునీటి లీకేజీలను అరికట్టడం మున్సిపాలిటీలకి సమస్యగా మారింది. ఈ దశలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం 'అమృత్ 2.0' పథకం కింద పనులు చేపట్టి త్వరితగతిన పూర్తిచేయాల్సి ఉంటుంది. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో ఈ పనులు నత్తనడకన జరుగుతున్నాయి. వచ్చే వేసవినాటికి తాగునీటి పైప్‌లైన్ల ఏర్పాటు పూర్తిచేయాల్సిన బాధ్యత కొత్త పాలకవర్గంపై ఉంది. పెద్ద గ్రామాలను మున్సిపాలిటీలుగా మార్చారు. పలు శివారు గ్రామాలను కలిపేసారు. మున్సిపాలిటీలో పదేండ్ల క్రితం చుట్టుపక్కల ఉన్న గ్రామాలు విలీనమయ్యాయి. అక్కడి ప్రజలపై పన్నుల భారం పెరిగిందే తప్ప, అందుకు తగిన అభివృద్ధి పనులు చేపట్టడంలేదు.

ముఖ్యంగా పట్టణ శివారుల్లోని కాలనీలు కనీసం రోడ్లు, డ్రైనేజీలకు నోచుకోవడం లేదు. శ్మశాన వాటికల సమస్య తీవ్రంగా ఉంది. పట్టణాల్లో కొన్నిచోట్ల దాతల సహకారంతో పునర్నిర్మించినా వందలవేల సంఖ్యలో శ్మశాన వాటికలు అధ్వాన్నంగా ఉన్నాయి. ఇకపోతే ఇంటింటికీ చెత్త సేకరణ రోజు విడిచి రోజు జరుగుతున్నప్పటికీ, ఈ సేకరణ సక్రమంగా జరగడంలేదు. పారిశుధ్య కార్మికుల కొరత, సరిపడా చెత్త వాహనాలు లేకపోవడం ఇందుకు కారణం. పెద్ద రోడ్లను శుభ్రపరిచే స్వీపింగ్ మెషిన్లను రంగంలోకి దింపాల్సి ఉంది. ఓపెన్ డ్రెయినేజీల కారణంగా అనేక పట్టణాల్లోని వార్డుల్లో దుర్గంధం వ్యాపిస్తున్నది. నీటి సరఫరా వ్యవస్థ సక్రమంగా లేదు. మిషన్ భగీరథ పైప్‌లైన్లు సరైన నిర్వహణలేక తరచూ లీకేజీలు అవుతున్నాయి. వార్డుల్లో పందులు, కుక్కలు స్వైర విహారం చేస్తున్నా పట్టించుకునే నాథుడేలేదు. దోమల బెడద తీవ్రంగా ఉంది. ఫాగింగ్ జాడనే లేదు. ఈ సమస్యలన్నీ ఇప్పటికిప్పుడు వచ్చినవి కావు. ఏళ్లుగా రాజ్యమేలుతున్నాయి. సరైన పద్ధతిలో పరిష్కారం చేయలేదు. వీటిని పరిశీలించి పరిష్కరించడం ద్వారా సిఎం రేవంత్ రెడ్డి మేలైన పాలనకు బాటలు వేయాలి.

# నగరంలో పారిశుద్ధ్యానికి పెద్దపీట

- పటిష్టంగా చెత్తసేకరణ పనులు
- ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణకు చర్యలు
- అధికారులతో సమీక్షించిన సిఎస్ రామకృష్ణారావు



**హైదరాబాద్, ఫిబ్రవరి 18 :** గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి గారి ఆదేశాల మేరకు బుధవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అధికారులు నగర పరిశుభ్రతపై ఇప్పటి వరకు తీసుకుంటున్న చర్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సి.ఎస్ కు వివరించారు. సమావేశంలో పరిశుభ్రత, చెత్త సేకరణ విధానం, పరిశుభ్రతా చర్యలు, ప్రజా ఆరోగ్య పరిరక్షణపై తీసుకుంటున్న చర్యలను సి.ఎస్ సమగ్రంగా పరిశీలించారు. వివరాలన్నంటిని ఎప్పటికప్పుడు డాష్ బోర్డ్ లో పొందుపరచాలని సి.ఎస్ ఆదేశించారు. జి.హెచ్.యం.సి పరిధిలో 4500 స్వచ్ఛ ఆటోలు ఇంటింటికి తిరిగి చెత్త సేకరిస్తున్నాయని, 2650 స్వయం సహాయక బృందాల సభ్యులు మొత్తం 18 వేల 557 మంది శానిటేషన్ విభాగంలో పనిచేస్తున్నారని జి.హెచ్.యం.సి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ తెలిపారు. నగర పరిధిలో రోజు వారిగా 7800 టన్నుల మేరకు గార్బేజ్ సేకరణ జరుగుతుందని అన్నారు. మున్సిపల్ విభాగం ప్రభుత్వంలో కీలకమని, ప్రజల అవసరాలకు తగినట్లుగా బాధ్యతలు నిర్వర్తించాలని, అధికారులు విధులలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించమని సి.ఎస్ అన్నారు. రాష్ట్రంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ మరింత సమర్థవంతంగా ఉండేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. చెత్త సేకరణ (డ్రై, వెట్ వేస్ట్), ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణ, మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సి.ఎస్ ఆదేశించారు. నగరంలో పారిశుధ్య పనుల పురోగతిని పర్యవేక్షించేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, సమయానుసారంగా నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీ వ్యవస్థలను శుభ్రపరిచే చర్యలు ముందస్తుగా చేపట్టాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ శాఖ కార్యదర్శి టి.కె.శ్రీదేవి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ శ్రీజన, మల్కాజ్‌గిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి, జోనల్ కమిషనర్లు, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

## గొంతునులిమి భార్య హత్య

### ఇస్రో మాజీ ఉద్యోగి అరెస్ట్

**బెంగళూరు, ఫిబ్రవరి 18 :** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ మాజీ ఉద్యోగి ఒకరిని బెంగళూరు పోలీసులు అరెస్టు చేశారు. బెంగళూరులోని తమ అపార్ట్‌మెంట్‌లో భార్యను గొంతునులిపి హత్య చేశారనే కారణంగా ఈ అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. నిందితుడుని 65 ఏళ్ల నాగేశ్వరరావుగా గుర్తించారు. అవలహళ్లి పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం మధ్యాహ్నం 11 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. బొమ్మెలహళ్లి ఏరియాలో ఉంటున్న నాగేశ్వరరావు తన భార్య సంధ్యశ్రీని టవలుతో గొంతు నులిమి హత్య చేశారని, ఘటనా స్థలిలోనే ఆయనను కస్టడీలోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు.ప్రాథమిక సమాచారం ప్రకారం, నిందితుడు తీవ్ర మానసిక ఒత్తిడితో ఉన్నారని, చికిత్స కూడా తీసుకుంటున్నారని తెలుస్తోంది. మొదట తన భార్యను చంపి తాను కూడా చనిపోవాలని ఆయన ఎ÷-లాన్ చేశారని, ప్రస్తుతానికి వేరే ప్రధాన కారణమేదీ కనిపించడం లేదని డీసీపీ (వైట్‌ఫీల్డ్) సైదులు తెలిపారు. హత్య అనంతరం నిందితుడు అపార్ట్‌మెంట్ నుంచే ఆ సమాచారాన్ని తెలిసిన వ్యక్తికి చెప్పడంతో పోలీసులకు సమాచారం వెళ్లినట్టు తెలుస్తోంది. అవలహళ్లి పోలీసు బృందం ఘటనా స్థలికి చేరుకుని సంధ్యశ్రీ హత్యను ధ్రువీకరించింది. రావును కస్టడీలోకి తీసుకుంది. కాగా, ఈ దంపతులకు ఒక కుమార్తె ఉన్నారు. అమెరికాలో ఉంటున్న ఆమెకు పోలీసులు సమాచారం తెలియజేశారు. ఈ ఘటనను హత్య కేసుగా నమోదు చేసి విచారణ చేపట్టారు.

## యాదగిరిగుట్టలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

### స్వస్తివాచనంతో ఉత్సవాలకు శ్రీకారం

**యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 18 :** యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ప్రధాన ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ మూలవర్యుల అనుమతితో నిజాభిషేకం, విశ్వక్సేనారాధన, జలపూజ, పుట్టమట్టిలో నవధాన్యాలు నాటడంతోపాటు స్వస్తివాచనం వంటి వైదృశ్య కార్యక్రమాలతో బుధవారం బ్రహ్మోత్సవాలకు ఆలయ అర్చకులు, అధికారులు శ్రీకారం చుట్టారు. ఉదయం 10 గంటలకు స్వస్తివాచన ఘట్టాన్ని ప్రారంభించారు. సకల దేవకోటిని ఉత్సవాలకు విచ్చేసి సర్వలోకాలకు క్షేమాన్ని కలిగించమని వేడుకునే కార్యక్రమం పాంచరాత్రాగమ శాస్త్ర ప్రకారం జరిపారు. తొలి పూజల్లో కలెక్టర్ హనుమంతరావు, ఆలయ ఆనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి, ఈవో భవాని శంకర్, డీఈవో భాస్కర్ శర్మ, ప్రధాన అర్చకులు కాండూరి వెంకటాచార్యులు, ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు. లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ఈ నెల 28 వ తేదీ వరకు జరగనున్నాయి. 24న స్వామివారి ఎదుర్కోలు, 25న తిరుకల్యాణం, 28న అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించి ఉత్సవాలకు ముగింపు పలుకనున్నారు. ఉత్సవాల సందర్భంగా నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సుదర్శన నారసింహ హోమం, జోడు సేవలు, ఏకాదశి లక్ష పుష్పార్చనలను అధికారు రద్దు చేశారు. బ్రహ్మోత్సవాల వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం 18 న స్వస్తి వాచనం, విష్వక్సేన ఆరాధన, సాయంత్రం మత్స్యగ్రహణం, అంకురార్పణ ఉంటుంది. 19న ఉదయం 11 గంటలకు ధ్వజారోహణం, సాయంత్రం భేరి పూజ చేపడతారు. ఫిబ్రవరి 20 న ఉదయం మత్సావతార అలంకారం, సాయంత్రం శేష వాహన సేవ వేదపారాయణములు. రాత్రి 7 గంటలకు శేష వాహన సేవ, 21 న ఉదయం వటపత్రశాయి అలంకార సేవ, రాత్రి హంసవాహన సేవ,22 న శ్రీ కృష్ణాలంకార సేవ, రాత్రి పొన్న వాహనసేవ చేపడతారు. 23 న ఉదయం గోవర్ధన గిరి ధారి, సాయంత్రం సింహ వాహన సేవ ఉంటుంది. 24న జగన్మోహినీ అలంకార సేవ, అశ్వ వాహనంపై రాత్రి ఎదుర్కోలు వేడుక చేస్తారు. 25న రాత్రి స్వామివారి తిరుకల్యాణ మహోత్సవం, 26న రాత్రి 8 గంటలకు దివ్వవిమాన రథోత్సవం,27 న స్వామి వారి చక్రతీర్థ స్నానం. ఫిబ్రవరి 28 న గర్భాలయంలోని మూలవరులకు నిర్వహించే సహస్ర ఘటాభిషేకంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తి అవుతాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకున్నారు.



## తెలుగు రాష్ట్రాల్లో కోర్టులకు బాంబు బెదిరింపులు

### రంగంలోకి దగిన బాంబ్ స్క్వాడ్ బృందాలు

**హైదరాబాద్/అమరావతి, ఫిబ్రవరి 18 :** తెలుగు రాష్ట్రాల్లోని పలు కోర్టులకు బుధవారం బాంబు బెదిరింపులు వచ్చాయి. హైదరాబాద్‌లోని నాంపల్లి, కరీంనగర్, రాజమహేంద్రవరం, అనంతపురం కోర్టులకు ఈ బెదిరింపులు వచ్చాయి. దాంతో ఆయా కోర్టుల్లో బాంబ్, డాగ్ స్క్వాడ్ బృందాలతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం కోర్టుకు ఉదయం బాంబు బెదిరింపు కాల్ వచ్చింది. దీంతో కోర్టు సిబ్బంది త్రీ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. దాంతో కోర్టు ప్రాంగణంలో బాంబు, డాగ్ స్క్వాడ్‌లతో పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ బాంబు కాల్ రావడంతో.. న్యాయవాదులు, కక్షిదారులను కోర్టు ప్రాంగణం నుంచి పోలీసులు బయటకు పంపేశారు. అలాగే ఈ కాల్ ఎక్కడి నుంచి వచ్చిందనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు కోర్టులో ఎక్కడా బాంబు ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఈ ఫోన్ కాల్ ఆకతాయి చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. మరోవైపు అనంతపురం కోర్టుకూ ఇదే తరహా ఫోన్ కాల్ వచ్చింది. ఇక తెలంగాణలో పలు కోర్టులకు ఈ-మెయిల్స్ ద్వారా బాంబు బెదిరింపులు అందాయి. ఆ జాబితాలో నాంపల్లి కోర్టు సైతం ఉంది. మధ్యాహ్నం 12.05 గంటలకు కోర్టుల్లో బాంబు పేలుతుందంటూ ఈ మెయిల్‌లో అగంతకులు పేర్కొన్నారు. దాంతో కోర్టులోని సిబ్బంది, న్యాయవాదులు, కక్షిదారులను బయటకు పంపి పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. అలాగే కరీంనగర్ కోర్టులో సైతం తనిఖీలు కొనసాగుతున్నాయి. గతంలో సైతం ఇదే తరహాలో కోర్టులకు బాంబు బెదిరింపులు వచ్చాయి. అయితే మళ్లీ అలాగే బాంబు బెదిరింపులు రావడంతో పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. దాంతో కోర్టుల్లో బాంబు, డాగ్ స్క్వాడ్‌తో ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలు ఇంకా కొనసాగుతున్నాయి.

## ప్రారంభమైన 4వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ మీట్

**హైదరాబాద్, ఫిబ్రవరి 18 :** తెలంగాణ రాష్ట్ర పోలీస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న '4వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2026' సైబరాబాద్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర డీజీపీ బి. శివధర్ రెడ్డి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్ క్రీడా జ్యోతిని అందించగా, డీజీపీ దానిని వెలిగించి పోటీలను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా 'జయ జయహే తెలంగాణ' గీతాన్ని క్రీడాకారులు, అధికారులు కలిసి ఆలపించగా మైదానమంతా రాష్ట్ర స్ఫూర్తితో మారుమోగింది. పోలీస్ లాంఛనాల మధ్య డీజీపీ గన్ ఫైర్ చేసి, గాలిలోకి బెలూన్లు ఎగురవేసి పోటీలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా డీజీపీ డీజీపీ బి. శివధర్ రెడ్డి మాట్లాడుతూ.. ముందుగా కార్యక్రమానికి హాజరైన వారందరినీ అభినందించారు. ఇటీవల రాష్ట్రంలో గ్లోబల్ సమ్మిట్, అంతర్జాతీయ ఫుట్‌బాల్ మ్యాచ్‌లు, గ్రామపంచాయతీ, మున్సిపల్ ఎన్నికల బందోబస్తు మరియు సమ్మక్క-సారక్క జాతర వంటి కీలక బాధ్యతలను పోలీసులు అత్యంత నిబద్ధతతో నిర్వహించారని కొనియాడారు. పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణలో నిత్యం బిజీగా ఉన్నప్పటికీ సిబ్బంది క్రీడల్లో పాల్గొనడం వారిలో నూతనోత్సాహాన్ని నింపుతుందన్నారు. పోలీసులు వ్యాయామాన్ని నిత్య జీవితంలోనూ భాగం చేసుకోవాలన్నారు. క్రీడలు మనలోని నాయకత్వ లక్షణాలను తట్టి లేపడం తో పాటు టీమ్ స్పిరిట్, ఐకమత్యాన్ని పెంచుతాయన్నారు. క్రీడల్లో పాల్గొనే వారు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారన్నారు. క్రీడలు మానసిక స్థైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయన్నారు. క్రీడల్లో పతకాలు సాధించడం కంటే కూడా మంచి స్నేహితులను సాధించడం గొప్ప అన్నారు. మహిళా పోలీసుల ప్రాతినిధ్యం ప్రతి విభాగంలోనూ పెరగాలని, ప్రతిభతో పాటు నాయకత్వ లక్షణాలను చాటుకోవాలని సూచించారు.

## ఇద్దరు మావోల లొంగుబాటు

### పునరావాసం కల్పిస్తామన్న అల్లూరి జిల్లా ఎస్పీ

**పాడేరు, ఫిబ్రవరి 18 :** ఛత్తీస్‌గఢ్‌లోని మాడేరియా డివిజన్ కమిటీకి చెందిన ఇద్దరు మావోయిస్టులు ఆంధ్ర పోలీసుల ఎదుట లొంగిపోయారు. బుధవారం అల్లూరి జిల్లా ఎస్పీ అమితి బర్దార్ ఎదుట వీరు స్వచ్ఛందంగా లొంగిపోయారు. అనంతరం జిల్లా ఎస్పీ బర్దార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ, పునరావాస పథకాలను పూర్తిగా వినియోగించుకుని గౌరవప్రదమైన, శాంతియుత జీవితం గడపాలని లొంగిపోయిన మావోయిస్టులకు ఆయన విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రభుత్వ ప్రాయోజిత శిక్షణ కార్యక్రమాల ద్వారా నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించాలని వారికి సూచించారు. అలాగే ఇతర మావోయిస్టులు సైతం సమీప పోలీస్ స్టేషన్‌లో స్వచ్ఛందంగా లొంగిపోవాలన్నారు. అలా కాకుంటే కుటుంబ సభ్యుల ద్వారా.. నేరుగా సీనియర్ పోలీస్ అధికారులను సంప్రదించాలని మావోయిస్టులకు జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఇద్దరు మావోయిస్టుల్లో ఒకరు మహిళా మావోయిస్టు ఉన్నారని తెలిపారు. కడితే హిడిం అలియాస్ అంజు అలియాస్ కరుణ- డివిజినల్ ఏరియా కమిటీ మెంటర్ , బద్చే భీమా అలియాస్ మనీష్ ఏరియా కమిటీ మెంటర్ గా పని చేశారని ఎస్పీ వివరించారు. వీరిద్దరు పలు నేరాలలో నిందితులను పోలీసులు ఈ సందర్భంగా చెప్పారు. మరో వైపు తాము లొంగిపోవడానికి గల కారణాలను ఈ ఇద్దరు మావోయిస్టులు వివరించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పోలీసుల ఆపరేషన్లు తీవ్రతరం చేశారని చెప్పారు. కొత్త పోలీసు శిబిరాల ఏర్పాటు చేయడం వల్ల మావోయిస్టుల కదలికలు పరిమితం అయ్యాయని వివరించారు. నేపథ్యంలో ప్రాణ భయం ఏర్పడిందని వివరించారు. మావోయిస్టుల పట్ల ప్రజల మద్దతు తగ్గిపోవడం కూడా ఒక కారణమన్నారు. అలాగే సిద్ధాంతాలపై విశ్వాసం కోల్పోయినట్లు చెప్పారు. నిరంతర లొంగుబాట్ల కారణంగా పార్టీ సిద్ధాంతాలపై నిరాశ పెరిగిందని చెప్పారు. ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో జరిగిన వరుస ఎన్‌కౌంటర్లలో పలువురు సీనియర్ మావోయిస్టు నేతలు మరణించడంతో తమ కార్యకలాపాల తీవ్రంగా బలహీనపడ్డాయని చెప్పారు. ప్రభుత్వ పునరావాస విధానాలు, ఉపాధి అవకాశాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ఏపీ ప్రభుత్వం అందిస్తున్న ఆకర్షణీయమైన లొంగుబాటు ప్రయోజనాలు - ఆర్థిక సహాయం, భూమి, ఉద్యోగాలు, సంక్షేమ పథకాలపై అవగాహన కలగడంతో తీవ్రవాదాన్ని విడిచి జన జీవన స్రవంతిలోకి తిరిగి వచ్చామన్నారు.

## ఇబ్రహీంపట్నం ఛైర్మన్ ఎన్నికకు లైన్ క్లియర్

### స్టే ఎత్తివేస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ

### కిడ్నాపైన కౌన్సిలర్ యాదగిరి హాజరు

**హైదరాబాద్, ఫిబ్రవరి 18 :** ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికకు లైన్ క్లియర్ అయ్యింది. మున్సిపల్ ఎన్నికపై గతంలో ఉన్న స్టేను తెలంగాణ హైకోర్టు ఎత్తివేసింది. ఈసీ, కలెక్టర్ తుది నిర్ణయం తీసుకోవాలని న్యాయస్థానం ఆదేశించింది. ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికపై బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఈ ఎన్నికపై రెండు రోజుల క్రితమే హైకోర్టు స్టే విధించగా.. దాన్ని ఎత్తివేస్తూ న్యాయస్థానం నిర్ణయం తీసుకుంది. మరోవైపు ఇబ్రహీంపట్నం 19వ వార్డు కౌన్సిలర్ ఆకుల యాదగిరి మిస్సింగ్‌పై హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారణ జరుగగా.. యాదగిరిని కోర్టు ముందు హాజరుపర్చారు ఇబ్రహీపట్నం పోలీసులు. అతడి స్టేట్‌మెంట్‌ను న్యాయస్థానం రికార్డ్ చేసింది. బీఆర్ఎస్ నేతలు తనను బలవంతంగా చీరాలకు తీసుకెళ్లి రిసార్ట్‌లో బంధించారని, ఎన్నికల ఫలితాలు వచ్చిన రోజు దాదాపు 12 గంటల పాటు హైదరాబాద్ మొత్తం తిప్పి చీరాలకు తీసుకెళ్లారని యాదగిరి స్టేట్‌మెంట్ ఇచ్చారు. ఈ క్రమంలో ఇబ్రహీంపట్నం పంచాయితీ తెలంగాణ హైకోర్టుకు చేరింది. కోర్టు ఆదేశాలతో ఇబ్రహీంపట్నం 19వ వార్డు కౌన్సిలర్ ఆకుల యాదగిరిని హైకోర్టులో హాజరుపరిచారు పోలీసులు. ఆకుల యాదగిరి కనిపించడం లేదని కుటుంబసభ్యులు.. హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. యాదగిరిని హైకోర్టు ముందు హాజరుపరచాలని రెండు రోజులు క్రితం న్యాయస్థానం ఆదేశించింది. బుధవారం కౌన్సిలర్ యాదగిరిని కోర్టులో హాజరుపర్చారు పోలీసులు. దీంతో హైకోర్టు ముందు యాదగిరి స్టేట్‌మెంట్ ఇచ్చారు. ఫలితాలు వెల్లడైన తర్వాత 12 గంటలపాటు హైదరాబాద్‌లో తిప్పారని.. బలవంతంగా తనను చీరాల తీసుకెళ్లారని చెప్పారు యాదగిరి. రెండు రోజులపాటు చీరాలలోని రిసార్ట్‌లో ఉంచారని తెలిపారు. హైకోర్టు ఉత్తర్వులతో నిన్న కౌన్సిల్ మీటింగ్‌కు హాజరైనట్లు ఆకుల యాదగిరి.. కోర్టుకు తెలియజేశారు. అతని స్టేట్‌మెంట్ పూర్తి అయిన తర్వాత హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ఇబ్రహీంపట్నం ఛైర్మన్ ఎన్నికపై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. రోవైపు క్యాంపు పేరుతో తన భర్తను కిడ్నాప్ చేశారని ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఆకుల యాదగిరి భార్య వసంత ఫిర్యాదు చేశారు. దీంతో యాదగిరి మిస్సింగ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఐపీసీ 363 కింద కిడ్నాప్ కేసు నమోదు చేసిన పోలీసులు.. విచారణ చేపట్టారు. ఇబ్రహీంపట్నం బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, అతని తనయుడు మంచిరెడ్డి ప్రశాంత్ రెడ్డిపై ఆకుల యాదగిరి భార్య అనుమానాలు వ్యక్తం చేశారు.



## ముగిసిన కీసరగుట్ట బ్రహ్మోత్సవాలు

**మేడ్చల్, నేడు బ్యూరో:** కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి ఆలయం బ్రహ్మోత్సవాలు నిన్న ఫిబ్రవరి 18న ముగిశాయి. ఈ నెల 13న గణపతి పూజ, యాగశాల ప్రవేశంతో ఈ బ్రహ్మోత్సవాలు ప్రారంభమైన విషయం తెలిసిందే. చివరి రోజు బుధవారం వేద పండితులు క్షేత్ర పూర్ణాహుతితో ఉత్సవాలను ముగించారు. ముగింపు సందర్భంగా ఆలయ కమిటీ ఛైర్మన్, కమిటి సభ్యులు వేదపండితులను సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ తటాకం వెంకటేష్ శర్మ, ఈ.ఓ సుధాకర్ రెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

## ఆర్మీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

**మేడ్చల్, నేడు బ్యూరో:** తెలంగాణ రాష్ట్రం నుంచి ఇండియన్ ఆర్మీలోకి రిక్రూటింగ్ కోసం 2027 అగ్నివీర్ (అన్ని కేటగిరీలు) రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ www.joinindianarmy.nic.in 18 ఫిబ్రవరి 2026 నుంచి – ఫస్ట్ ఏప్రిల్ 2026 వరకు అందుబాటులో ఉంటుందని జిల్లా కలెక్టర్ మను చౌదరి వెల్లడించారు. మేడ్చల్ జిల్లాలోని ఆసక్తి గల యువకులు పెద్ద ఎత్తున వెబ్ పోర్టల్ లో పేర్లు నమోదు చేసుకోవాలని కలెక్టర్ బుధవారం వెల్లడించిన ఒక ప్రకటనలో సూచించారు.



## చర్చి కాలనీలో రూ.2.27 కోట్లతో అభివృద్ధి పనులు

**ఉప్పల్, నేడు న్యూస్:** ఉప్పల్ డివిజన్ పరిధిలోని చర్చి కాలనీలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. కాలనీలో చాలా కాలంగా నెలకొన్న కలుషిత మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా రూ. 1.09 కోట్లతో వాటర్ పైప్‌లైన్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ పనులను ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి, ఉప్పల్ మాజీ కార్పొరేటర్ మందుముల రజితా పరమేశ్వర్ రెడ్డి పరిశీలించారు. పనుల పురోగతిని అధికారులతో చర్చించి, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని సూచించారు. పైప్‌లైన్ పనులు పూర్తయ్యిన వెంటనే రూ. 1.18 కోట్లతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. నీటి సరఫరా వ్యవస్థ, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణంతో చర్చి కాలనీకి మౌలిక సదుపాయాలు మరింత బలపడనున్నాయి. మొత్తం రూ. 2.27 కోట్లతో చేపట్టిన ఈ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎమ్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ జనరల్ మేనేజర్ రజనీకాంత్ రెడ్డి, చర్చి కాలనీ అధ్యక్షుడు జానీ, సుధాకర్, లుకాస్, రత్నరెడ్డి, డేవిడ్, ప్రవీణ్, సతీష్, సునీల్, రోసి మేరి, కార్తీక్, పుష్పాలమ్మ, ఫ్రాన్సిస్, బాలస్వామి, సల్ల ప్రభాకర్ రెడ్డి, సందీప్, భాస్కర్, రాఘవేంద్ర, వల్లపు శ్రీకాంత్ యాదవ్, సాగ శ్రీధర్, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## సంత్ సేవాలాల్ జయంతి

**ఉప్పల్, కుషాయిగూడ, నేడు న్యూస్:** చక్రిపురం చౌరస్తాలో గిరిజన ఆరాధ్య దైవం, బంజారా సమాజ ఆత్మగౌరవ ప్రతీక సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బొంతు శ్రీదేవి యాదవ్ సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ బోధనలు సమాజానికి దిశానిర్దేశకమని పేర్కొన్నారు. ప్రకృతిని ప్రేమించే తత్వం, సమానత్వ భావన, సామాజిక న్యాయం కోసం చేసిన కృషి నేటి తరానికి ఆదర్శమని తెలిపారు. బంజారా సమాజ అభివృద్ధి కోసం ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. యువత ఆయన ఆశయాలను అనుసరించి సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. జయంతి వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించగా, స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరై సేవాలాల్ మహారాజ్ ఆశయాలను స్మరించారు. ఈ కార్యక్రమంలో లంబాడీ ఐక్య వేదిక అధ్యక్షుడు హనుమంత్ నాయక్, అరుణ, మహంకాళి ఆలయ కమిటీ అధ్యక్షుడు శంకర్ నాయక్, నరసింహ నాయక్, కిషన్ నాయక్, శ్రీనివాస్ నాయక్, ధనుంజయ్ నాయక్, శివుడు నాయక్, జగన్ నాయక్, దశరథ్ నాయక్, లక్ష్మణ్ నాయక్, జమల నాయక్, హీరలాల్ నాయక్, మిట్యా నాయక్, చాంద్నన్ నాయక్, రెడ్డి నాయక్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సీతారాం రెడ్డి, ప్రకాష్ రెడ్డి, గణేష్ గౌడ్, భాను చందర్, రామ రెడ్డి, మున్నీ, నిర్మల పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిని సన్మానించిన బీసీ సంఘం అధ్యక్షుడు సాయిని యాదగిరి

**వలిగొండ, నేడు న్యూస్ :** మున్సిపల్ ఎన్నికల్లో భువనగిరి నియోజకవర్గం లో బీసీ వర్గాలకు ప్రాధాన్యత కల్పించి అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతగా, బీసీ సంఘం అధ్యక్షుడు సాయిని యాదగిరి ఆధ్వర్యంలో కుంభం అనిల్ కుమార్ రెడ్డి ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు శాలువా కప్పి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. బీసీ వర్గాల అభివృద్ధికి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి చేస్తున్న కృషి ప్రశంసనీయమని సాయిని యాదగిరి పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా బీసీలకు మరింత ప్రోత్సాహం అందించాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, అన్ని వర్గాల అభివృద్ధే తన లక్ష్యమని, బీసీల సంక్షేమానికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని హామీ ఇచ్చారు.



# మైనార్టీల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

- రాష్ట్ర మైనార్టీల సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్
- మేడ్చల్ జిల్లా మైనార్టీలకు 13 మోపెడ్‌ల పంపిణీ




**మేడ్చల్ నేడు బ్యూరో:** మైనార్టీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర మైనార్టీల సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ అన్నారు. బుధవారం హైదరాబాద్ జిల్లా నాంపల్లి రోజ్ గార్డెన్‌లో మైనార్టీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందించే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ మాట్లాడుతూ, రాష్ట్రంలో సీ.ఎం రేవంత్ రెడ్డి మైనారిటీల అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. శాసన మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్: పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా మైనార్టీలకు అందిస్తున్న ఆర్థిక సహాయంలో భాగంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో భాగమైన మేడ్చల్ జిల్లా మైనార్టీలకు ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన పథకం కింద 232 మందిని ఎంపిక చేసి, అందులో 225 కి గాను ప్రస్తుతం 5 గురుకి రూ. 1,12,50,000 చెక్కును పంపిణీ చేశామన్నారు. ఇందులో, ప్రతి నిరుపేద మహిళలకు రూ. 50,000 ఆర్థిక సహాయం అందిస్తున్నామని, అలాగే, రేవంత్ అన్న భరోసా పథకం కింద మేడ్చల్ జిల్లాలోని 25 మంది మైనార్టీలకు మోపెడ్ లను పంపిణీ చేశామన్నారు. ఇందులో, ప్రతి వాహనం రూ. లక్ష విలువగా ఉందన్నారు. జిల్లాలో 25 మంది లబ్ధిదారులను ఎంపిక చేయగా, ప్రస్తుతం 13 మందికి వాహనాలు అందిస్తున్నామని డాక్టర్: మహేందర్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ ఆలీ మాట్లాడుతూ, మైనారిటీల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుండగా మేం అండగా నిలుస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కోత్వాల్ , గురుకుల పాఠశాల చైర్మన్ ఫయిమ్, ఎమ్మెల్సీ మీర్జా రహమత్ బేగ్, రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ సెక్రటరీ షఫీఉల్లా , ఎం.జీ.ఎం పర్సిస్ మేడ్చల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## కమిషనర్ సార్ అక్రమ నిర్మాణాలపై ఓ కన్నేయండి

- రాజబోల్లారంలో అక్రమ నిర్మాణాలు
- అటువైపు కన్నెత్తి చూడని అధికారులు
- ప్రభుత్వ ఖజానాకు గండి
- అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు



**మేడ్చల్, నేడు న్యూస్:** ఎల్లంపేట పురపాలక సంఘం పరిధిలోని రాజబొల్లారం వార్డు కార్యాలయానికి కూతవేటు దూరంలో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. అధికారుల అండతో అక్రమ నిర్మాణదారులు రెచ్చిపోతున్నారు. అనుమతులు లేకున్నా అక్రమ నిర్మాణాలు నిర్మిస్తూ ఎల్లంపేట పురపాలక సంఘం కార్యాలయానికి రావలసిన ప్రభుత్వ ఆదాయాన్ని కొల్లగొడుతున్నారు. స్థానిక అధికారులే సూత్రధారులుగా మారడంతో అక్రమ నిర్మాణదారులు రెచ్చిపోతూ అక్రమ నిర్మాణాలు నిర్మించేస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుండగా సంబంధిత శాఖ అధికారుల జేబులు నిండుతున్నాయనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా కమీషనర్ స్పందించి ఎల్లంపేట పురపాలక సంఘం పరిధిలోని రాజబొల్లారం వార్డు పరిధిలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై దృష్టి సారించి.. ఇక్కడ సాగుతున్న అక్రమ నిర్మాణాల వ్యవహారంపై విచారణ చేసి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

### అనుమతులు లేకున్నా నిర్మాణాలు :

పురపాలక సంఘం కార్యాలయం నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా రాజబొల్లారం వార్డు కార్యాలయం పరిధిలో సుమారు పదికి పైగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. సదరు నిర్మాణాల విషయంలో చర్యలు తీసుకోవాల్సిన అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. నిర్మాణం చేపట్టే ముందు కమిషనర్ అనుమతి తీసుకోవడం తప్పనిసరి, కానీ ఎలాంటి అనుమతులు తీసుకోకుండా నిర్మిస్తున్న నిర్మాణాల విషయంలో ప్రభుత్వ ఖజానాకు రావలసిన ఆదాయం గండి పడుతుందని ఇప్పటికైనా సదరు అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు పురపాలక సంఘం కమిషనర్ ను కోరుతున్నారు..

### అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవు

**: స్వామి నాయక్, కమిషనర్ ఎల్లంపేట పురపాల సంఘం**



ఎలాంటి అనుమతులు లేకుండా రాజబొల్లారం వార్డు కార్యాల యం పరిధిలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను పరిశీలించి సదరు అక్రమ నిర్మాణాలపై, వాటిని నిర్మిస్తున్న నిర్మాణదా రులపై, అక్రమ నిర్మాణదారులకు సహకరించే అధికారులపై, అనుమతులు లేకుండా చేపడుతున్న నిర్మాణాలపై నేరుగా నా వద్దకు వచ్చి ఫిర్యాదు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాము.



## మాజీ సీఎంని కలిసిన వీరాభిమాని

**ఇనుగుర్తి, నేడు న్యూస్:** తన అభిమాన నాయకుడు మాజీ ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర రావు జన్మదినాన్ని పురస్కరించుకొని మండలంలోని మీఠ్య తండా శివారు మర్రి కుంట తండా కు చెందిన గుగులోతు రాములు మంగళవారం తన అభిమాన నాయకున్ని ఎర్రవెల్లి ఫామ్ హౌస్ లో కేసీఆర్ ను కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి తన అభిమానాన్ని చాటుకున్నాడు




## చర్లపల్లి డివిజన్‌లో కీర్తిశేష భువనగిరి ధనంజయ గౌడ్ జయంతి వేడుక

**ఉప్పల్/ చర్లపల్లి, నేడు న్యూస్:** చర్లపల్లి డివిజన్ పరిధిలోని మధుసూదన్ రెడ్డి కాలనీ మాజీ అధ్యక్షుడు, కీర్తిశేష భువనగిరి ధనంజయ గౌడ్ జయంతి వేడుక నిర్వహించబడింది. ఈ కార్యక్రమం బొంతు శ్రీదేవి యాదవ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ధనంజయ గౌడ్ సమాజ సేవలో, కాలనీ అభివృద్ధిలో చేసిన విశిష్ట సేవలను పాల్గొన్న నాయకులు స్మరించుకున్నారు. కాలనీలో మౌలిక వసతుల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, సామాజిక కార్యక్రమాల నిర్వహణలో ఆయన చేసిన కృషిని వివరించారు. ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు సమన్వయంతో పనిచేసినప్పుడే కాలనీలు ఆదర్శంగా మారుతాయని పేర్కొన్నారు. ధనంజయ గౌడ్ చొరవతో పాటు బొంతు దంపతుల సహకారం ఈ ప్రాంత అభివృద్ధికి నిదర్శనంగా నిలిచిందని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.



## ఉప్పల్ మీడియా కమిటీ నూతన సభ్యులకు సన్మానం చేసిన మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్

**ఉప్పల్, నేడు న్యూస్:** ఉప్పల్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా కమిటీ నూతన సభ్యులు మేడ్చల్‌--మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అధ్యక్షుడు వడ్డేపల్లి కిషోర్ నాయకత్వంలో జరిగిన ఈ భేటీలో ఎంపీ కమిటీ సభ్యులను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఈటెల రాజేందర్ మాట్లాడుతూ, 35 సంవత్సరాల తర్వాత ఉప్పల్‌లో సీనియర్ జర్నలిస్టు వడ్డేపల్లి కిషోర్ నాయకత్వంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ప్రెస్ క్లబ్‌ను స్థాపించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఐకమత్యంతో, సమన్వయంతో నూతన కమిటీ సమర్థంగా పని చేసి మీడియా ప్రతిష్ఠను మరింత పెంచాలని ఆకాంక్షించారు. రాబోయే రోజుల్లో కమిటీకి అవసరమైన సదుపాయాల కోసం ప్రభుత్వం తరఫున సహకారం అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మీడియా నిష్పక్షపాత ధోరణితో పనిచేస్తూ ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన కల్పించడంలో మీడియా కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. ఉప్పల్ ప్రెస్ క్లబ్ చేపట్టే సామాజిక సేవా కార్యక్రమాలకు తన సంపూర్ణ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ బీజేపీ అధ్యక్షుడు మారినేని ఫణిందర్, ప్రధాన కార్యదర్శి తీగ విట్టల్ రావు, కోశాధికారి దువ్వాళ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## సెరినిటీ విద్యార్థులకు 'విశిష్ట ప్రతిభా రత్న' అవార్డు

**కరస్పాండెంట్ నోముల జంగిరెడ్డి**

**ఉప్పల్, కప్రా, నేడు న్యూస్:** హిందీ సేవా సదన్ మహావిద్యాలయ్ నిర్వహించిన రాష్ట్ర స్థాయి పరీక్షల్లో ప్రథమ స్థానం సాధించిన నాగారం సెరినిటీ పాఠశాల విద్యార్థులు హారిక, ఆరాధ్య గవర్నర్ చేతుల మీదుగా 'విశిష్ట ప్రతిభా రత్న' పురస్కారం అందుకోవడం పాఠశాలకు గర్వకారణమని కరస్పాండెంట్ నోముల జంగిరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో అగ్రస్థానం సాధించి రూ. 2,500 నగదు పురస్కారం, బంగారు పతకం, ప్రశంసా పత్రం అందుకోవడం విద్యార్థుల ప్రతిభకు నిదర్శనమని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా అవార్డు అందుకోవడం ప్రత్యేక గౌరవంగా భావిస్తున్నామని అన్నారు. ఈ విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులను అభినందిస్తూ, విద్యార్థులను పాఠశాల తరఫున బుధవారం విద్యార్థులను ప్రత్యేకంగా సత్కరించి అభినందించారు. భవిష్యత్తులో కూడా మరిన్ని విజయాలు సాధించి పాఠశాల పేరును రాష్ట్ర స్థాయిలో మరింత ప్రతిష్ఠాత్మకంగా నిలబెట్టాలని ఆకాంక్షించారు.



## రెచ్చగొట్టే విద్వేష సంస్కృతి దేశ భద్రతకు, ఐక్యతకు ప్రమాదకరం

**జవహర్ నగర్ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ పాషా మియా**

**జవహర్ నగర్, నేడు న్యూస్ :** ఇటీవల జరిగిన మేడారం సమ్మక్క–సారక్క జాతరలో చోటు చేసుకున్న కోవా –బన్ను వివాదం దేశా ఐక్యతకు భద్రతకు ప్రమాదకరమని జవహర్ నగర్ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ భాషా మియా అన్నారు. ఈ మేరకు బుధవారం జవహర్ నగర్ లోని చెన్నాపురం దేవేందర్ నగర్ లో ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ కార్యదర్శి టి కాలేషా అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ జాతరలో సామాజిక బాధ్యతను విస్మరించి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా ప్రవర్తించిన ఓ మీడియా ప్రతినిధులు, సంస్థపై పోలీసులు, పాలకులు కఠినంగా వ్యవహరించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పొట్టకూటి కోసం జాతరలో కోవా బన్ను వ్యాపారం చేస్తున్న వారిపై ఓ మీడియా సంస్థ ప్రాంతీయ తత్వాలను, తత్వాలను ప్రేరేపించే విధంగా వ్యవహరించారని దయమెత్తారు. మీడియా ముసుగులో విషపూరిత ప్రచారాలు చేసేవారు ఉగ్రవాదులతో సమానమని, ఇలాంటి వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బి ఎస్ పి జవహర్ నగర్ అధ్యక్షులు కలకోట ప్రభాకర్, అభ్యుదయ రచయిత షేక్ మీరా, ఏఐఎఫ్టియు అధ్యక్షులు వై. మల్లేష్, ఇఫ్ట్ జాతీయ కన్వీనర్ షేక్ షావలి, పి ఓ డబ్ల్యు (విముక్తి )నాయకురాలు పెరిక సునీత, ఆఫ్ తెలంగాణ ఫౌండర్ మహమ్మద్ మొయినుద్దీన్, కమిటీ సభ్యులు మహమ్మద్ సోహెల్, మహమ్మద్ గౌస్ బాబా, సయ్యద్, మహమ్మద్ వహీద్, ఎండి అలీ తదితరులు పాల్గొన్నారు.



## కళ్యాణలక్ష్మి షాధీముభారక్ చెక్కుల పంపిణీ

**పాల్గొన్న ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**

**వలిగొండ, నేడు న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ పట్టణం,మండలానికి సంబంధించిన కళ్యాణలక్ష్మి షాధీముభారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్య భీమా నాయక్, తాసిల్దార్ దశరథ, వలిగొండ సర్పంచ్ కుంభం వెంకట్ పాపిరెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి, పట్టణాధ్యక్షుడు కంకల కిష్టయ్య, బత్తిని సహదేవ్,పర్సశీ సతీష్,కాసుల వెంకన్న, బత్తిని నాగేష్, కొండూరు సాయి యూత్ కాంగ్రెస్ నాయకులు బత్తిని వరుణ్, మైసొల్ల ప్రవీణ్ వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## మల్కాజిగిరి నియోజకవర్గ సమస్యలు పరిష్కరించాలి

- ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి
- మేడ్చల్ జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం సమర్పణ

**మేడ్చల్, నేడు బ్యూరో:** జిల్లాలోని మల్కాజిగిరి నియోజక వర్గం మౌలాలి, గౌతమ్ నగర్ డివిజన్‌లోని ఏకలవ్య నగర్ ప్రాంతంలో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ల నిర్మాణానికి తగిన ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని మల్కాజిగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఆయన ఈ మేరకు మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరిని కలుసుకుని మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం వివిధ అంశాలపై వినతిపత్రాలను సమర్పించారు. అందులో ముఖ్యంగా, వినాయక్ నగర్ డివిజన్, సఫిల్ గూడలో ఇప్పటికే కేటాయించిన ప్రభుత్వ స్థలానికి బదులుగా అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నిర్మాణానికి అనుకూలమైన ప్రత్యామ్నాయ స్థలాన్ని కేటాయించాలని కోరారు. అలాగే, యాప్రాల్‌లో ప్రస్తుతం ఉన్న ప్రైమరీ హెల్త్ సెంటర్ స్థలాన్ని రక్షిస్తూ, దానిని ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేయాలన్నారు. అదేవిధంగా, బ్రాహ్మణ సంఘం కోసం ప్రత్యేకంగా స్థలం కేటాయించాలని కోరారు. ఇక నేరెడ్మేట్, ఆర్.కే.పురం, అంతయ్య కాలనీలలో ఉన్న కమ్యూనిటీ స్థలాలను పరిరక్షించాలని అభ్యర్థించారు. అల్వాల్ పరిధిలోని భూదాన్ భూముల్లో స్టేడియం, క్రీడా మైదానాల నిర్మాణానికి తగిన స్థలం కేటాయించాలని కూడా ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి కలెక్టర్ ను కోరారు. ఆర్.కే.పురం ఫ్లైఓవర్ నిర్మాణం వల్ల ప్రభావితమవుతున్న ఆర్మీ భూముల్లో ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్న పేద కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను మంజూరు చేయాలనీ, ఏ.ఓ.సీ అదనపు రోడ్ నిర్మాణానికి అవసరమైన భూమిని కేటాయించాలని కూడా ఎమ్మెల్యే కలెక్టర్ ను కోరారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థాపన కోసం తగిన స్థలం కేటాయించాలని, వక్ఫ్ ఆస్తులను నిషేధిత జాబితాలో చేర్చిన సెక్షన్ 22ఎ నుంచి తొలగించాలని రాజశేఖర్ రెడ్డి కలెక్టర్ ను కోరారు. అనంతరం ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి మీడియాకు వివరాలు విడుదల చేస్తూ, జిల్లా కలెక్టర్ తమ వినతులను సానుకూలంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు పేర్కొన్నారు.




## మున్సిపల్ ఎన్నికల్లో దళితుడిపై దాడి చేసిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

- జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి డిమాండ్
- సీపీ దృష్టికి తీసుకువెళ్తుతామన్న పోలీస్ అధికారులు
- కుల ధృవీకరణ పత్రం జారీలో ఆలస్యంపై రెవెన్యూ అధికారులను నిలదీసిన సభ్యులు
- స్కావెంజర్స్ కు ఉపాధికి డిమాండ్



**మేడ్చల్, నేడు బ్యూరో:** జిల్లాలో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా అలియాబాద్ మున్సిపాలిటీ లాల్గడి మలక్ పేటలో దళితుడు, బి.ఆర్.ఎస్ కార్యకర్త డిల్లీ పరమేశ్ పై దాడి చేసిన కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి జిల్లా కలెక్టర్ మను చౌదరి, పోలీస్ అధికారులను కోరారు. బుధవారం మేడ్చల్ -మల్కాజ్ గిరి కలెక్టరేట్ లో జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ, మాన్యు వల్ స్కావెంజింగ్ కమిటీ, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్, ఎస్సీ, ఎస్టీ స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ ల అమలుపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డితో పాటు, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్ పర్సన్ జి.వెన్నెల, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఇందులో, జిల్లాలో ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలు, స్కావెంజర్స్ సమస్యలు, ఎస్సీ,ఎస్టీ డెవలప్మెంట్ ఫండ్ అమలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ, మున్సిపల్ ఎలక్షన్లో బి.ఆర్.ఎస్ కార్యకర్తలపై జరిగిన దాడికి బాధ్యులైన వారిపై తప్పకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై పోలీస్ అధికారులు స్పందిస్తూ, సమస్యను పోలీస్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి, చర్యలు తీసుకుంటామన్నారు.

**కుల ధృవీకరణ జారీలో ఆలస్యం చేస్తున్నారు :** జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కి గురైన బాధితులకు సమస్య పరిష్కారానికి, కేసు నమోదు, పరిహారం చెల్లింపు తదితర అంశాలకు సంబంధించి కుల ధృవీకరణ పత్రం మంజూరుకు రెవెన్యూ అధికారులు ఆలస్యం చేస్తున్నారని కమిటీ సభ్యులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై అధికారులు స్పందిస్తూ, సర్టిఫికెట్లు త్వరగా మంజూరుకు చర్యలు చేపట్టాలన్నారు

### స్కావెంజర్స్‌కు ఉపాధి కల్పించాలి :

అలాగే, మాన్యువల్ స్కావెంజర్స్ కు ఇతర ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని డీ.వీ.ఎం సభ్యులు అధికారులను కోరారు. దీనిపై అధికారులు స్పందిస్తూ, అవసరమైన చర్యలు చేపడతామన్నారు.

ఎస్సీ, ఎస్టీ స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్స్ పై చర్చ : ఎస్సీ, ఎస్టీ ల అభివృద్ధికి ప్రభుత్వం, రాష్ట్ర స్థాయిలో అమలు చేస్తున్న స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్స్ ను జిల్లా స్థాయిలో కూడా వివిధ డిపార్ట్మెంట్స్ లలో అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా సమావేశం నిర్ణయం తీసుకుంది. సమావేశంలో, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, డి.ఆర్.వో హరిప్రియ, జిల్లా ఎస్సీ వెల్ఫేర్ ఆఫీసర్ జి. వినోద్, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, పోలీసు అధికారులు, రెవెన్యూ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పుట్టగొడుగుల్లా వాటర్ ప్లాంట్లు

- మినరల్ వాటర్ పేరిట అక్రమ దందా
- ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వాటర్ ప్లాంట్ల యజమానులు
- కనిపించని బీఐఎస్ ప్రమాణాలు
- అధికారుల తనిఖీలు శూన్యం
- ఇకనైనా పట్టించుకోవాలని ప్రజల వేడుకోలు



**గ్రేటర్ హైదరాబాద్ పురపాలక సంఘం కార్యాలయం పరిధిలో గల మేడ్చల్ సర్కిల్ కార్యాలయం పరిధిలో మినరల్ వాటర్ వినియోగం పెరిగిపోయింది. ప్రజలు కొని తాగేనీరు అసలేనా.. నకిలీనా అని తెలుసుకోని పరిస్థితి నెలకొంది. దీనిని ఆసరాగా చేసుకొని మార్కెట్లో మినరల్ వాటర్ పేరిట అక్రమ దందాకు తెరలేపారు కొంతమంది వ్యాపారులు. వీధికో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తూ.. నాణ్యత ప్రమాణాలు పాటించకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. నీటి ప్రమాణాలను పరీక్షించాల్సిన అధికారులు నిద్రావస్థలో జోగుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.**

**మేడ్చల్, నేడు న్యూస్ :** గ్రేటర్ హైదరాబాద్ మేడ్చల్ సర్కిల్ కార్యాలయం పరిధిలో నీటి శుద్ధి పేరిట దోపిడీ జరుగుతుంది. అనుమతి లేకుండా విచ్చలవిడిగా వెలుస్తున్న నీటి శుద్ధి కేంద్రాల (ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ల)పై అధికారుల నిఘా కరువైంది. దీంతో వాటర్ ప్లాంట్ల నిర్వహకులు సరఫరా చేసిందే శుద్ధి నీరు అన్నట్లుగా ఉంటుంది. వాటర్ ప్లాంట్ల యజమాన్యాలు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్ (బీఐఎస్) నిబంధనలు పాటించకుండా మినరల్ వాటర్ పేరుతో మాయాజాలం చేస్తున్నారు. కొన్నిచోట్ల అపరిశుభ్రమైన నీరు వస్తున్నది. ప్రజారోగ్యాన్ని దెబ్బతిసే నీటి వ్యాపారానికి కళ్లెం వేయాల్సిన స్థానిక సంస్థలు, ఆరోగ్యశాఖ అధికారుల తనిఖీలు ఎక్కడా కానరావడం లేదు. పుట్టగొడుగుల్లా వాటర్ ప్లాంట్లు వెలుస్తున్నా కంటికి కానరావడం లేదంటే వారి పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. తనిఖీలు చేపడితే ప్రజారోగ్యానికి రక్షణ కల్పించిన వారవుతారనే అభిప్రాయం వినిపిస్తున్నది.



### నిబంధనలకు నీళ్లు :

నిబంధనల ప్రకారం వాటర్ ప్లాంట్లలో ఎయిర్ కండిషనర్ తో పాటు కెమికల్ ల్యాబ్, మైక్రో బయోలజీ ల్యాబ్, ఫిల్లింగ్ గది, బీఐఎస్ నిబంధనలకు అనుగుణంగా ప్లాంట్ అంతా స్టెయిన్లెస్ స్టీల్ తో ఉండాలి. ఇవే కాకుండా అధికారులు ప్రతి మూడు నెలలకోసారి ఆయా ప్లాంట్లలో నీటి నమూనాలను సేకరించి పలు రకాల పరీక్షలు నిర్వహించాలి. సంతృప్తికరంగా ఉంటేనే అనుమతులు ఇవ్వడం కానీ, అంతకుముందు ఉంటే కొనసాగించడం వంటివి చేస్తారు. ప్లాంట్ నిర్వహణతో పాటు ప్యాకెట్లు, బాటిళ్లకు కూడా ప్రత్యేక అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కానీ అధికారుల కార్యాలయాలకు సైతం ప్యూరిఫైడ్ పేరుతో నీటిని సప్లయ్ చేస్తున్నా వాటిని ప్రజలకు అందుబాటులో ఉంచడమే కాకుండా అధికారులు తాగుతున్నారే తప్ప అసలు ఈ వాటర్ ప్లాంట్ ఎక్కడ ఏర్పాటు చేశారు. సంబంధిత శాఖ అనుమతులు ఇవ్వకుండానే ఏ విధంగా నీటిని సరఫరా చేస్తున్నారనే కనీస పట్టింపు లేకుండా అధికారులు తమ విధులను కొనసాగిస్తున్నారు

### ఎలా చేయాలి :

బోరులో నీటిని ట్యాంకులోకి పంపి క్లోరినేషన్ చేయాలి. కొంత సమయం తర్వాత శాండ్ ఫిల్టర్లో శుభ్రం చేయాలి. తర్వాత కార్బన్ ఫిల్టర్స్, మైక్రాన్ ఫిల్టర్లో శుభ్రం చేసి రివర్స్ అస్మోసిస్ చేయాలి. మినరల్స్ ను జతచేసి ఓజోనైజేషన్ జరపాలి. అల్ట్రా వయోలెట్ రేడియేషన్ తో శుద్ధిచేసి నమూనాలు తీయాలి. నమూనాలను మైక్రో బయోలజీ, కెమిస్ట్ ప్రయోగశాలలో పరీక్షించాలి. ఆ తర్వాత క్యాన్లలోకి, బాటిళ్లలోకి తీసుకోవాలి.

### అనారోగ్యం బారిన ప్రజలు :

రంగులేని నీరు కాస్తంత తియ్యగా ఉంటే చాలుననే ఉద్దేశ్యంతో శుద్ధ నీరు తయారీ కేంద్రాన్ని నడిపించేస్తున్నారు. నిబంధనల మేరకు నీటిని శుభ్రం చేయకుండానే విక్రయిస్తున్నారు. బాటిల్ నీటిని కొన్న రెండు రోజుల్లోనే అందులో చిన్నచిన్న క్రిములు తయారవుతున్నాయి. ఈ నీటిని తాగడంతో వ్యాధులు వచ్చే అవకాశాలున్నాయని ప్రస్తుతం కొందరికి కిడ్నీ సంబంధిత వ్యాధులకు కారణం అవుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. అంతేకాకుండా కలరా, టైఫాయిడ్, జాండిస్, చర్మ వ్యాధులతో పాటు ఇతర వ్యాధులు వచ్చే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

### నిత్యం లక్షల్లో వ్యాపారం :

ప్యూరిఫైడ్ మంచినీటి పేరుతో రోజుకు లక్షల్లో అక్రమ వ్యాపారం కొనసాగించడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. సర్కిల్ కార్యాలయంలో అన్ని హోటళ్లకు, వ్యాపార, వాణిజ్య సముదాయాలకు, ప్రభుత్వ, ప్రైవేటు, కార్యాలయాలకు, సర్కిల్ కార్యాలయం పరిధిలో నివాసముండే వుండే అన్ని కాలనీల ప్రజలకు మంచినీటిని ట్రాలీ ఆటోల ద్వారా పెద్ద పెద్ద డ్రమ్ములతో, క్యాన్లతో నీటిని సరఫరా చేస్తూ లక్షల్లో అడ్డగోలు వ్యాపారం నిర్వహిస్తున్నారు.

### తనిఖీలు శూన్యం :

ప్రజా ఆరోగ్యాన్ని దెబ్బతీసే నీటి వ్యాపారానికి కళ్లెం వేయాల్సిన స్థానిక ప్రభుత్వ సంస్థలు, ఆహార భద్రత శాఖ అధికారులు తనిఖీలు ఎక్కడ కానరాకపోవడం గమనార్హం. తమకేమి పట్టనట్లు చూస్తుంటే వారి పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

# జర్నలిస్టులు సామాజిక బాధ్యతతో పనిచేయాలి

**టీయూడబ్ల్యూజే రంగారెడ్డి జిల్లా మీడియా డైరీ ఆవిష్కరణ సభలో మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి**





**రంగారెడ్డి, నేడు ప్రతినిధి:** జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో రంగారెడ్డి యూనిట్ పాత్ర ప్రశంసనియమని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నాంపల్లి లోని మీడియా అకాడమీ కార్యాలయంలో బుధవారం టీయూడబ్ల్యూజే రూపొందించిన రంగారెడ్డి జిల్లా మీడియా డైరీని రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ, కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సలీమ్, సత్యనారాయణలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఎండి. సలీమ్ పాషా అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జర్నలిస్టులకు రూ. 5 లక్షల ప్రమాద భీమా కల్పించటంతో పాటు, నియోజకవర్గాల్లో ఆరోగ్య శిబిరాలు నిర్వహించటం గొప్ప విషయం అన్నారు. చేవెళ్ల నియోజకవర్గం షాబాద్ లో మృతి చెందిన జర్నలిస్ట్ రాములు కుటుంబానికి అండగా యూనియన్ నిలబడటం మంచి పరిణామం అన్నారు. జిల్లాలో చనిపోయిన జర్నలిస్టుల జాబితా ఇవ్వాలని, వారి కుటుంబాలకు అకాడమీ ద్వారా సహాయం అందిస్తామన్నారు. అదేవిదంగా మృతి చెందిన జర్నలిస్ట్ ల భార్యలకు 5 సంవత్సరాల వరకు రూ.3 వేల రూపాయల పెన్షన్ తో పాటు, 10 వ తరగతి లోపు చదివే పిల్లలకు ప్రతి నెల ఒక వేయి రూపాయలు ఇవ్వటం జరుగుతుందన్నారు. విలేకరులకు సమాజంలో ఎంతో గౌరవం ఉంటుందని, అది కాపాడుతూ సామాజిక బాధ్యతతో పనిచేయాలన్నారు.అదేవిదంగా జర్నలిస్టులు ఆరోగ్యాలను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. జిల్లా సమగ్ర సమాచారంతో డైరీని రూపొందించిన రంగారెడ్డి జిల్లా శాఖను శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. మీడియా అకాడమీ ద్వారా రంగారెడ్డి జిల్లా జర్నలిస్టులకు శిక్షణ కుడా ఇవ్వటం జరిగిందన్నారు.రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ మాట్లా డుతూ రాష్ట్రం లోనే కాకుండా దేశ వ్యాప్తంగా జర్నలిస్టుల పక్షాన పోరాడే ఏకైక యూనియన్ టీయూడబ్ల్యూజే -ఐజేయూ మాత్రమే అని అన్నారు. రంగారెడ్డి జిల్లాలో విద్య, వైద్య పరంగా యూనియన్ చేస్తున్న కృషిని ఆయన కొనియాడారు.నూతన డైరీ ఆవిష్కరణ సందర్భంగా జిల్లా జర్నలిస్ట్ లకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. షాబాద్ లో మృతి చెందిన జర్నలిస్ట్ రాములు కుటుంబానికి రూ.8 లక్షల సహాయం అందించటం జరిగిం దన్నారు. జిల్లా జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామ న్నారు. రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఎండి. సలీమ్ పాషా మాట్లాడు తూ.. జిల్లా సమగ్ర సమాచారంతో రంగారెడ్డి జిల్లా మీడియా డైరీ 2026 ను రూపొందించటం జరిగిందన్నారు. మీడియా అకాడమీ చైర్మన్ సహకారంతో జిల్లా జర్నలిస్టులకు రెండు రోజుల శిక్షణా తరగతులు విజయవంతంగా పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. అదేవి దంగా రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ సూచనల మేరకు జిల్లా జర్నలిస్టు లకు పలు నియోజకవర్గాల్లో ఆరోగ్య శిబిరాలు నిర్వహించినట్లు, రానున్న రోజుల్లో మిగతా నియోజకవర్గాల్లో కూడా పూర్తి చేస్తామన్నా రు. ఈ సందర్భంగా మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ, కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి లను శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొండా విజయ్ కుమార్ ఆధ్వర్యంలో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సత్యనారా యణ, జాతీయ కౌన్సిల్ సభ్యులు ప్రవీణ్, స్టాఫ్ రిపోర్టర్లు జంగయ్య, ఫణింద్ర, జిల్లా ఉపాధ్యక్షులు భీమయ్య, కార్యదర్శులు ఆంజనేయులు, సూర్యనారాయణ, రమేష్, జిల్లా కోశాధికారి శశిపాల్ రెడ్డి, శేరిలింగంపల్లి, రాజేంద్ర నగర్ నియోజకవర్గాల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొండా విజయ్ కుమార్, దామోదర్ రెడ్డి, ఎలాక్ట్రానిక్ మీడియా కోశాధికారి మధు, జిల్లా కార్యవర్గ సభ్యులు దర్శనం జంగయ్య, ఇలియాజ్, సీనియర్ రిపోర్టర్లు సుభాష్, శేఖర్, తిరుపతి రెడ్డి, శంకర్, రత్నం, యాసీన్, బస్వారాజ్, ఫరీద్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## భీముడు కుటుంబానికి గ్రామస్థుల అండ

**కారేపల్లి. నేడు న్యూస్:** పోలంపల్లి గ్రామానికి చెందిన పేద రైతు భీముడు కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందడంతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. కుటుంబానికి ఆర్థికంగా తీవ్రమైన ఇబ్బందులు తలెత్తిన నేపథ్యంలో గ్రామస్థులు ముందుకు వచ్చి బియ్యం రూపంలో సహాయం అందించారు. భీముడు కుటుంబం కష్టాల్లో నిలబడేందుకు ఇది చిన్నచూపు కాదని, గ్రామం మొత్తం అండగా ఉంటుందని గ్రామస్థులు భరోసా ఇచ్చారు. భవిష్యత్తులోనూ కుటుంబానికి అన్ని విధాలుగా చేయూతనందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఇలాంటి సమయంలో గ్రామస్తుల ఐక్యత ప్రశంసనీయమని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ హేమలత బాలాజీ, మాజీ సర్పంచ్ ధారావత్ బద్రు నాయక్, వార్డు సభ్యులు అజ్మీర సంపత్, భానుతు లావణ్య, లక్ష్మణ్, ధారావత్ బదియా నాయక్, జర్పల బావ్ సింగ్, గుగులోతు కూన, భూక్యా భద్రు, దేవులాల్, రాందేస్, తావూరియా, వీరన్న, గోపాల్ తదితరులు పాల్గొన్నారు. గ్రామస్థుల సహకారంతో భీముడు కుటుంబానికి కొంత ఊరట లభించిందని స్థానికులు తెలిపారు.

## దుస్తులను లాగడమూ అత్యాచార యత్నమే: సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ :** మహిళ దుస్తులను పట్టుకొని లాగటం, వక్షోజాలను తాకడం అత్యాచారం కిందకు రాదంటూ అలహాబాద్ హైకోర్టు జడ్జి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఆ వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ జరిపింది. నిందితులకు అనుకూలంగా హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను కొట్టేసింది. 2021 నవంబరులో ఉత్తర్‌ప్రదేశ్‌లోని కస్‌గంజ్ ప్రాంతానికి చెందిన ఓ మహిళ, తన 11 ఏళ్ల (ఘటన జరిగే నాటికి) కుమార్తెతో కలిసి బంధువుల ఇంటి నుంచి తిరిగి వస్తుండగా అదే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు వారిని సమీపించి బాలికను ఇంటి దగ్గర దింపుతామని ద్విచక్ర వాహనంపై ఎక్కించుకున్నారు. మార్గమధ్యంలో అమ్మా యిని అసభ్యంగా తాకుతూ కల్వర్టు కిందకు తీసుకువెళ్లేందుకు ప్రయత్నిం చారు. బాలిక అరుపులు విని అటుగా వెళ్తున్నవారు రావడంతో నిందితులు అక్కడినుంచి పరారయ్యారు. ఈ కేసుపై విచారణ జరిపిన అలహాబాద్ హైకోర్టు జడ్జి మహిళ వక్షోజాలను తాకడం, దుస్తులు పట్టుకొని లాగినంత మాత్రాన అత్యాచారం కిందకు రాదంటూ కేసును కొట్టివేశారు. ఇలాంటి వ్యాఖ్యలతో సమాజంలోకి తప్పుడు సందేశం వెళ్లే అవకాశం ఉందని, సుప్రీం కోర్టు జోక్యం చేసుకోవాలని అభ్యర్థనలు వచ్చాయి. ఆ కేసును సుప్రీంకోర్టు సుమోటోగా విచారణకు తీసుకుంది. హైకోర్టు న్యాయమూర్తి వ్యాఖ్యలు ఏమాత్రం సున్నితమైన వి కావని, అమానవీయంగా ఉన్నాయని గత విచారణ లో విచారం వ్యక్తం చేసింది. ఆ జడ్జి ఇచ్చిన తీర్పుపై స్టే విధించడమే గాకుం డా.. ఆ వివాదాస్పద వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలంటూ కేంద్రం, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు కూడా జారీచేసింది. ఈ నేపథ్యంలోనే తాజా తీర్పు వెలువడింది.




# ది కేరళ స్టోరీ సీక్వెల్ ట్రైలర్ విడుదల

## సంచలనం సృష్టిస్తున్న ట్రైలర్

2023లో బాక్సాఫీస్ వద్ద వివాదాలు సృష్టించిన 'ది కేరళ స్టోరీ' చిత్రానికి సీక్వెల్‌గా 'ది కేరళ స్టోరీ 2: గోస్ బియాండ్' ప్రేక్షకుల ముందుకు రాబోతున్న సంగతి తెలిసిందే. ఫిబ్రవరి 27న ఈ సినిమా విడుదల కానున్న నేపథ్యంలో, తాజాగా చిత్ర యూనిట్ ట్రైలర్‌ను విడుదల చేయగా.. ఈ ట్రైలర్ సామాజిక మాధ్యమాల్లో పెను దుమారం రేపుతోంది. మొదటి భాగం కంటే ఈ సీక్వెల్ మరింత వివాదాస్పదంగా, అత్యంత తీవ్రమైన అంశాలతో రూపొందినట్లు ట్రైలర్ చూస్తుంటే స్పష్టమవుతోంది. రాబోయే 25 ఏళ్లలో భారత్ ఇస్లామిక్ రాజ్యంగా మారుతుంది అనే వివాదాస్పద డైలాగ్‌తో ఈ ట్రైలర్ ప్రారంభంకాగా.. ఈసారి దర్శకుడు కామాఖ్య నారాయణ్ సింగ్ కథను కేవలం కేరళకే పరిమితం చేయకుండా.. రాజస్థాన్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో జరుగుతున్నట్లు చెబుతున్న బలవంతపు మత మార్పిడిలు, లవ్ జిహాద్ వంటి అంశాలను ఇందులో చూపించారు. నిర్మాత విపుల్ అమృత్‌లాల్ షా నిర్మించిన ఈ చిత్రంలో గతంలో నటించిన అదా శర్మ స్థానంలో ఉల్కా గుప్తా, అదితి భాటియా, ఐశ్వర్య ఓజా ప్రధాన పాత్రలు పోషించారు. మత మార్పిడికి నిరాకరించిన యువతులను చిత్రహింసలకు గురిచేయడం, బలవంతంగా గొడ్డు మాంసం తినిపించడం వంటి కఠినమైన దృశ్యాలను మేకర్స్ ఈ ట్రైలర్‌లో పొందుపరిచారు. అయితే ఈ ట్రైలర్‌పై కేరళ నెటిజన్ల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ముఖ్యంగా బలవంతంగా గొడ్డు మాంసం తినిపించే సన్నివేశంపై వారు మండిపడుతున్నారు. కేరళలో బీఫ్‌ను అందరూ ఇష్టంగా తింటారని, ఎవరికీ బలవంతంగా తినిపించాల్సిన అవసరం లేదని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. మరోవైపు, ఈ సినిమా సమాజంలోని చేదు నిజాలను ధైర్యంగా చూపిస్తోందని మరికొందరు సమర్థిస్తున్నారు.




# అక్కినేని ప్రేమాభిషేకానికి 45 ఏళ్లు పూర్తి

అక్కినేని నాగేశ్వరరావు నటించిన చిత్రాల్లో ఎప్పటికీ గుర్తుండిపోయే ఐకానిక్ సినిమా 'ప్రేమాభిషేకం'. అప్పట్లో ఇది సిల్వర్ జూబ్లీ జరుపుకుంది. దేవదాసు తరవాత మళ్లీ అంతటి సినిమాగా ప్రాచుర్యం పొందింది. ఈచిత్రం విడుదలై 45 ఏళ్లు పూర్తయిన సందర్భంగా అన్నపూర్ణ స్టూడియోస్ ప్రత్యేక వీడియోను పంచుకుంది. లక్షల మంది హృదయాల్లో ఏఎన్నార్ ఎప్పటికీ జీవించే ఉంటారని పేర్కొంది.

# అల్లు, అట్లీల మూవీ రికార్డు

## అనౌన్స్‌మెంట్ సాంగ్‌కు మిలియన్ వ్యూయర్స్

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మరియు స్టార్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ కాంబినేషన్‌లో వస్తున్న భారీ ప్రాజెక్ట్ ఎఎ23. కేవలం ఒక చిన్న అనౌన్స్‌మెంట్ వీడియోతోనే సరికొత్త చరిత్రను సృష్టించింది ఈ కాంబో. అయితే సినిమా కోసం సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ ఓ పాటను కంపోజ్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఈ పాట ఇన్‌స్టాగ్రామ్‌లో అరుదైన రికార్డును అందుకుంది. ఈ పాటకి ఇన్‌స్టాలో 1 మిలియన్ కంటే ఎక్కువ రీల్స్ అందుకున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. దీంతో ఒక ఇండియన్ ఫిల్మ్ అనౌన్స్‌మెంట్ థీమ్ ఈ స్థాయిలో వైరల్ అవ్వడం ఇదే తొలిసారి అని ట్రేడ్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ అరుదైన ఘనత సాధించిన సందర్భంగా అల్లు అర్జున్, లోకేష్ కనగరాజ్ కలిసి దిగిన ఫోటో ప్రస్తుతం ఇంటర్నెట్‌లో తెగ చక్కర్లు కొడుతోంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ షూటింగ్ 2026లో ప్రారంభం కానుంది.



# లోకా:చాప్టర్1 సినిమాకు సీక్వెల్ రెడీ..

## షూటింగ్ అప్డేట్ ఇచ్చిన కళ్యాణి ప్రియదర్శన్

గతేడాది ఓనం సీజన్‌లో ఒక చిన్న మెరుపులా వచ్చి, బాక్సాఫీస్ వద్ద పిడుగులా మారిన సినిమా 'లోకా:చాప్టర్1'. మలయాళంలోనే తొలి ఫీమేల్ సూపర్ హీరోగా కళ్యాణి ప్రియదర్శన్ చేసిన మ్యాజిక్ అంతా ఇంతా కాదు. రూ. 300 కోట్లకు పైగా కలెక్షన్లు రాబట్టడంతో పాటు ప్రేక్షకుల ప్రశంసలు పొందింది. అయితే ఈ సినిమా ముగింపులోనే సీక్వెల్‌పై భారీ అంచనాలు పెంచిన దర్శకుడు డొమినిక్ అరుణ్, ఇప్పుడు చాప్టర్-2 కి రంగం సిద్ధం చేశారు. తాజాగా ఓ ఈవెంట్‌లో కళ్యాణి మాట్లాడుతూ..'లోక-2 కోసం అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని తెలుసు. ప్రస్తుతం ఈ సినిమా స్క్రిప్ట్ పనులు జరుగుతున్నాయి. ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి చిత్రీకరణ ప్రారంభించే అవకాశం ఉంది. నేను కూడా ఈ పార్ట్‌లో నటిస్తున్నాను.. కాబట్టి మరిన్ని విశేషాల కోసం వేచి ఉండండి. త్వరలోనే అప్డేట్స్ ఇస్తాం" అంటూ కళ్యాణి క్లారిటీ ఇచ్చారు. మొదటి భాగంలో ఆమె పోషించిన 'నీలి' పాత్ర, ఆధునిక ప్రపంచంలో ఒక సూపర్ పవర్‌గా మారి విలన్ నాచియప్పను ఎదు- ర్కోవడం ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇచ్చింది. దర్శకుడు డొమినిక్ అరుణ్ జానపద కథలను ఫాంటసీతో కలిపి ఒక వెండితెర విజువల్ వండర్‌ను సృష్టించారు. రెండో భాగంలో కథ మరింత ఆసక్తికరంగా ఉండనుందని సమాచారం. ఇందులో టొవినో థామస్ 'మైఖేల్' (చాత్తాన్) పాత్రలో.. వేఫారర్ ఫిల్మ్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న దుల్కర్ సల్మాన్, 'చార్లీ' (ఒడియన్) గా అతిథి పాత్రలో కనిపిస్తున్నట్లు టాక్. మలయాళంలోనే తొలి మహిళా సూపర్ హీరో చిత్రంగా గుర్తింపు పొందిన ఈ సినిమా సీక్వెల్ కోసం కేవలం మలయాళ ప్రేక్షకులే కాకుండా, పాన్ ఇండియా ఆడియన్స్ ఎదురుచూస్తున్నారు. సెప్టెంబర్ నుంచి షూటింగ్ ప్రారంభం కానుండటంతో, వచ్చే ఏడాది ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద మరోసారి మంటలు రేపడం ఖాయం అని అంతా భావిస్తున్నారు.



# నా విజయాల వెనుక ఉన్న అసలు శక్తి సురేఖయే

## భార్య పుట్టిన రోజు చిరు ఎమోషనల్ పోస్ట్

మెగాస్టార్ చిరంజీవి తన సతీమణి సురేఖ పుట్టినరోజు మరియు వారి వివాహ వార్షికోత్సవం సందర్భంగా సోషల్ మీడియా వేదికగా ఎమోషనల్ పోస్ట్‌ను పంచుకున్నారు. తన సినీ ప్రయాణంలోనే కాకుండా, జీవిత ప్రయాణంలోనూ తనకు అండగా నిలిచిన సురేఖపై తనకున్న అపారమైన ప్రేమాభిమానాలను ఆయన ఈ సందర్భంగా చాటుకున్నారు. 1980 ఫిబ్రవరి 20న వివాహం చేసుకున్న ఈ జంట త్వరలోనే 46వ వివాహ వార్షికోత్సవాన్ని జరుపుకోనుండగా, సురేఖ తన విజయాల వెనుక ఉన్న అసలు శక్తి అని చిరంజీవి కొనియాడారు. తన ప్రతి అడుగులో వెంట నడిచిన సురేఖకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ, ఆమె తమ కుటుంబానికి కేంద్రబిందువని, అందరినీ ప్రేమానురాగాలతో ఒక్కటిగా ఉంచే శక్తి ఆమెకే ఉందని చిరంజీవి పేర్కొన్నారు. తన కుటుంబ సభ్యులను సొంతవారిగా భావించి, తల్లిదండ్రులకు కన్నకూతురిగా మారిపోయిన తీరును ఆయన గుర్తు చేసుకున్నారు. తన సక్సెస్ గురించి ఎవరైనా అడిగితే అది కేవలం తన టాలెంట్ వల్లనో, కష్టం వల్లనో వచ్చినది కాదని, అది పూర్తిగా సురేఖ వల్లే సాధ్యమైందని చిరంజీవి స్పష్టం చేశారు. ఇంటి బాధ్యతలన్నింటినీ ఆమె భుజాన వేసుకోవడం వల్లే తాను ఎటువంటి ఆందోళన లేకుండా వృత్తిపై దృష్టి పెట్టగలిగానని, ఏ సంక్షోభంలోనైనా తమను కలిపి ఉంచే బలం ఆమె అని ఆయన ఎమోషనల్ అయ్యారు. 'నేను ఈ రోజు ఇలా ఉన్నానంటే దానికి కారణం నువ్వే' అంటూ తన మనసులోని మాటను హృద్యంగా పంచుకున్న ఈ పోస్ట్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. మెగా అభిమానులు, సినీ ప్రముఖులు సురేఖ కొణిదెల గారికి పెద్ద ఎత్తున పుట్టినరోజు మరియు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.






# నిర్మాతగా నిత్యామీనన్

తన సహజ సిద్ధమైన నటనతో తెలుగు ప్రేక్షకుల మనసు గెలుచుకున్న నిత్యామీనన్, ఇప్పుడు ఒక కొత్త బాధ్యతను భుజాన వేసుకున్నారు. కేవలం నటిగానే కాకుండా, తన అభిరుచికి తగ్గ కథలను వెండితెరకు పరిచయం చేసేందుకు ఆమె ఇప్పుడు నిర్మాతగా అవతారమెత్తారు. తన సొంత నిర్మాణ సంస్థ 'కీయురి ప్రొడక్షన్స్' లోగో వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా నిత్యా షేర్ చేసిన ఎమోషనల్ నోట్ ఇప్పుడు నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తోంది. నిర్మాతగా మారడంపై నిత్యా స్పందిస్తూ.. "నాకు సినిమాలు తీయడమంటే కేవలం కథలు చెప్పడం మాత్రమే కాదు. ఆ మూవీ చూసేవారిలో, చేసేవారిలో ఒక మార్పును తీసుకురావాలి. నటిగా నా ప్రయాణం మొదలైన రోజు నుంచి ఇదే నా లక్ష్యం, ఇప్పుడు నిర్మాతగా కూడా అదే బాధ్యతను కొనసాగిస్తాను" అని తెలిపారు. 'కీయురి' అనే పేరుకు అర్థం వివరిస్తూ.. ఇది భూమి గుహల నుంచి పుట్టి, కాంతిని ప్రేమించే ఒక రూపం లేని శక్తి అని ఆమె పేర్కొన్నారు. విభిన్నమైన ఆలోచనలతో సినిమాలను నిర్మించాలనే ఆమె ఆశయం ఇందులో స్పష్టంగా కనిపిస్తోంది. నిర్మాతగా మారిన ఈ శుభ సందర్భంలో, తన తొలి సినిమా 'అలా మొదలైంది' విడుదలై 15 ఏళ్లు పూర్తి చేసుకోవడం విశేషం. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ నిత్యా ఎమోషనల్ అయ్యారు. షూటింగ్ సమయంలో దర్శకురాలు నందిని రెడ్డి చెప్పిన మాటలు నిజమయ్యాయని, ఒక చిన్న సినిమాగా మొదలైన ఆ ప్రయాణం తన జీవితాన్నే మార్చేసిందని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం నటిగా తన చేతిలో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసే పనిలో ఉన్న నిత్యా, త్వరలోనే తన నిర్మాణ సంస్థలో రాబోయే తొలి సినిమా వివరాలను వెల్లడించే అవకాశం ఉంది. ఇక నిత్యా పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా.. అది చూసిన వారంతా కంగ్రాట్స్ అంటూ కామెంట్లు పెడుతున్నారు.

# మూడో రోజూ లాభాల్లో సూచీలు



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా లాభాల్లో ముగిశాయి. ఉదయం నష్టాల్లో ట్రేడైన సూచీలు.. ఆఖర్లో కొనుగోళ్ల మద్దతుతో రాణించాయి. ముఖ్యంగా మెటల్, ప్రభుత్వరంగ బ్యాంక్ స్టాక్స్ సూచీలను ముందుకు నడిపించాయి. దీంతో సూచీలు వరుసగా మూడో రోజూ లాభాల్లో ముగియగా.. నిఫ్టీ 25800 ఎగువన స్థిరపడింది. సెన్సెక్స్ ఉదయం 83,553.59 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 83,450.96) లాభాల్లో ప్రారంభమైంది. కాసేపటికే నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 83,163.62 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. తర్వాత మళ్లీ లాభాల బాట పట్టింది. చివరికి 283.29 పాయింట్ల లాభంతో 83,734.25 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 93.95 పాయింట్ల లాభంతో 25,819.35 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 90.66గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా స్టీల్, ఐటీసీ, యాక్సిస్ బ్యాంక్, రిలయన్స్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు లాభపడ్డాయి. ఎటర్నల్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, అదానీ పోర్ట్స్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 67 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4922 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.




# నెదర్లాండ్స్‌పై భారత్ విజయం

## చెలరేగిన దూబె



**అహ్మదాబాద్ :** టీ20 ప్రపంచకప్ గ్రూప్ దశను భారత్ అజేయంగా ముగించింది. గ్రూప్–ఎ ఆఖరి మ్యాచ్‌లో బుధవారం 17 పరుగుల తేడాతో నెదర్లాండ్స్‌ను ఓడించింది. శివమ్ దూబె (66; 31 బంతుల్లో 4x4, 6x6) మెరవడంతో మొదట భారత్ 6 వికెట్ల నష్టానికి 193 పరుగులు చేసింది. ఆర్యన్ దత్ (2/19), డెలీడ్ (0/28) కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. వాన్ బీక్ 56 పరుగులిచ్చి మూడు వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో నెదర్లాండ్స్ 7 వికెట్లకు 176 పరుగులు చేసింది. బాస్ డెలీడ్ (33; 23 బంతుల్లో 3x4, 1x6) టాప్ స్కోరర్. మరో అయిదుగురు బ్యాటర్లు 20పై స్కోర్లు చేశారు. వరుణ్ చక్రవర్తి (3/14), శివమ్ దూబె (2/35) రాణించారు. బుమ్రా (1/17) పొదుపుగా బౌలింగ్ చేశాడు. దూబెకు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

**పోరాడారు..:** భారత్ గెలుపుపై ఏ దశలోనూ సందేహాలు లేకున్నా.. ఛేదనలో నెదర్లాండ్స్ బ్యాటింగ్ ఆకట్టుకుంది. అయితే ఆరంభం నుంచి ఆ జట్టు వెనుకబడే ఉంది. పవర్‌ప్లే ముగిసే సరికి ఆ జట్టు 36/1తో నిలిచింది. ఆ తర్వాత లెవిట్ (24)ను హార్దిక్ ఔట్ చేశాడు. ఆకర్‌మ్యాన్ (23)తో కలిసి డెలీడ్ ఇన్నింగ్స్‌ను నడిపించడంతో 12 ఓవర్లకు నెదర్లాండ్స్ 94/2తో నిలిచింది. అయితే వరుణ్ తర్వాతి ఓవర్లో ఆకర్‌మ్యాన్, ఆర్యన్ దత్‌ను ఔట్ చేసి.. ఆ జట్టును దెబ్బతీశాడు. కాసేపటి తర్వాత డెలీడ్‌ను దూబె వెనక్కి పంపాడు. డచ్ జట్టు 14వ ఓవర్లకు 112/5తో నిలవగా.. సాధించాల్సిన రన్‌రేట్ బాగా పెరిగిపోయింది. నెదర్లాండ్స్ ఇన్నింగ్స్‌ను భారత్ ఇక తేలికగానే ముగిస్తుంది అనిపించింది. కానీ అది సాధ్యం కాలేదు. క్యాషే (26), క్రోస్ (25 నాటౌట్), ఎడ్వర్డ్స్ (15) తమ జట్టును పోటీలో ఉంచే ప్రయత్నం చేశారు. నెదర్లాండ్స్ ఆఖరి బంతి వరకూ ఆడింది.

**ఆఖర్లో విధ్వంసంతో..:** అంతకుముందు టీమ్‌ఇండియాకు అంత తేలికగా పరుగులు రాలేదు. కట్టుదిట్టంగా బౌలింగ్ చేసిన డచ్ బౌలర్లు.. ఇన్నింగ్స్‌లో చాలా భాగం భారత బ్యాటర్లకు కళ్లెం వేయగలిగారు. కానీ ఒకే ఒక్కడి మెరుపు ఇన్నింగ్స్ టీమ్‌ఇండియాకు మెరుగైన స్కోరును అందించింది. అతడే శివమ్ దూబె. మిగతా బ్యాటర్లు భారీ షాట్లు ఆడేందుకు ఇబ్బందిపడ్డా.. దూబె మాత్రం బ్యాట్ ఝుళిపించాడు. దూకుడైన బ్యాటింగ్‌తో భారత్ గట్టి లక్ష్యాన్ని నిర్దేశించడానికి ప్రధాన కారకుడయ్యాడు. అతడు నిలవకుంటే టీమ్‌ఇండియా పరిస్థితి భిన్నంగా ఉండేదే. స్పిన్నర్ల బౌలింగ్‌లో భారత బ్యాటర్లు ఇబ్బందిపడ్డారు. ముఖ్యంగా ఆఫ్‌స్పిన్నర్ ఆర్యన్ దత్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. అయితే ఆఖరి అయిదు ఓవర్లలో విధ్వంసంతో ఇన్నింగ్స్‌ను టీమ్‌ఇండియా సంతృప్తికరంగా ముగించింది.

**దూబె ధనాధన్:** టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఆరంభంలో గట్టి దెబ్బతగిలింది. పేలవ ఫామ్‌ను కొనసాగిస్తూ ఓపెనర్ అభిషేక్ మూడో బంతికే వెనుదిరిగాడు. ఆర్యన్ దత్ అతణ్ని వెనక్కి పంపాడు. ఇషాన్ కిషన్ (18; 7 బంతుల్లో 2x4, 1x6) కొన్ని చక్కని షాట్లు ఆడినా.. ఎక్కువసేపు నిలువలేదు. అయిదో ఓవర్లో, దత్ బౌలింగ్‌లోనే బౌల్డయ్యాడు. బంతి తక్కువ ఎత్తులో రావడంతో షాట్లు ఆడడం బ్యాటర్లకు కాస్త కష్టమైంది. తిలక్ వర్మ (31; 27 బంతుల్లో 3x4, 1x6), సూర్యకుమార్ (34; 28 బంతుల్లో 2x4, 1x6) నిలిచినా.. పరుగులు వేగంగా రాలేదు. 9వ ఓవర్లో తిలక్ వెనుదిరిగేసరికి స్కోరు 69 పరుగులే. 6 నుంచి 11 ఓవర్ల మధ్య భారత్‌కు 32 పరుగులే వచ్చాయి. అయితే చెలరేగి ఆడిన దూబె.. ఇన్నింగ్స్ స్వరూపాన్నే మార్చేశాడు. నిలదొక్కుకోవడానికి కాస్త సమయం తీసుకున్న అతడు.. ఆ తర్వాత బ్యాట్ ఝుళిపించాడు. ఆకర్‌మ్యాన్ బౌలింగ్‌లో రెండు సిక్స్‌లు, ఓ ఫోర్ బాదేశాడు. స్వేచ్ఛగా ఆడలేకపోయిన సూర్యకుమార్ 14వ ఓవర్లో వెనుదిరగడంతో 41 పరుగుల నాలుగో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. అతడి స్థానంలో వచ్చిన హార్దిక్ (30) మొదట భారీ షాట్లు ఆడలేకపోయాడు. కానీ దూబె మాత్రం రెచ్చిపోయాడు. వాండెర్‌మెర్వ్ ఓవర్లో రెండు సిక్స్‌లు, వాన్‌బీకర్ ఓవర్లో రెండు సిక్స్‌లు, ఫోర్‌తో అభిమానులను ఉర్రూతలూగించాడు. హార్దిక్ తొలి 16 బంతుల్లో 16 పరుగులే చేశాడు. అతడు 19వ ఓవర్లో జోరందుకున్నాడు. ఆ ఓవర్లో రెండు సిక్స్‌లు బాదిన హార్దిక్.. ఆఖరి ఓవర్లో ఇంకో సిక్స్ కొట్టి, ఇన్నింగ్స్ ఆఖరి బంతికి ఔటయ్యాడు. అంతకంటే ముందు దూబె ఓ సిక్స్ కొట్టి నిష్క్రమించాడు. ఆఖరి 5 ఓవర్లలో భారత్ 75 పరుగులు రాబట్టింది.




# యూట్యూబ్ డౌన్..

## లక్షలాది మంది యూజర్ల ఫిర్యాదు

ప్రముఖ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ యూట్యూబ్ సేవల్లో బుధవారం కొంతసేపు అంతరాయం నెలకొంది. వీడియోలు ప్లే కాకపోవడం, లాగిన్ అవకపోవడం వంటి సమస్యలు తలెత్తాయి. దీంతో లక్షలాది మంది యూజర్లు సామాజిక మాధ్యమాల వేదికగా ఫిర్యాదులు చేశారు. అమెరికా సహా ప్రపంచవ్యాప్తంగా ఈ సమస్య తలెత్తినట్లు డౌన్‌డిటెక్టర్ వెల్లడించింది. దాదాపు మూడు లక్షల మందికి పైగా యూట్యూబ్‌పై ఫిర్యాదులు చేసినట్లు తెలిపింది. ముఖ్యంగా యాప్‌లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. దీంతో పాటు వెబ్‌సైట్, యూట్యూబ్ టీవీ సేవల్లోనూ అంతరాయం నెలకొంది. దీనిపై యూట్యూబ్ యాజమాన్యం స్పందించింది. స్ట్రీమింగ్‌లో సమస్యలు ఎదురవుతున్నట్లు తమకు ఫిర్యాదులు అందాయని తెలిపింది. ""రికమెండేషన్ సిస్టమ్‌లో సమస్య వల్ల యూట్యూబ్ హోంపేజీ, యాప్, యూట్యూబ్ కిడ్స్, మ్యూజిక్‌లో వీడియోలు రావట్లేదు. లాగిన్ అవలేకపోతున్నామని కూడా కొందరు చెబుతున్నారు. ఇది విస్తృత సమస్య" అని యూట్యూబ్ వెల్లడించింది. ఈ సమస్యను పరిష్కరించామని, ప్రస్తుతం అన్ని సేవలు యథావిధిగా అందుబాటులోకి వచ్చాయని తెలిపింది.



# భారత్ విశ్వాసంతో ఉంది..

## లేబర్ మార్కెట్ మారుతుంది: రిషి సునాక్

కృత్రిమ మేధ శరవేగంగా దూసుకొస్తున్న తరుణంలో భారత్ ఏఐ ఇంపాక్ట్ సదస్సును నిర్వహిస్తూ ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ సందర్భంగా దిల్లీకి వచ్చిన అంతర్జాతీయ ప్రముఖులు, రాజకీయ నేతలు తమ అభిప్రాయాలు వ్యక్తంచేస్తున్నారు. ఏఐ విషయంలో భిన్నమైన వైఖరులు కనిపిస్తున్నాయని బ్రిటన్ మాజీ ప్రధాని రిషి సునాక్ అన్నారు. లేబర్ మార్కెట్ మారుతోందన్నారు. "భారత్‌వంటి దేశాలు ఈ సరికొత్త సాంకేతిక ప్రగతిపట్ల విశ్వాసం, ఆశావాదం వ్యక్తంచేస్తున్నాయి. అదే సమయంలో పాశ్చాత్య దేశాల్లో ఆందోళన కనిపిస్తోంది" అని పేర్కొన్నారు. విధానపరమైన నిర్ణయాలతో ఈ అంతరాలను పూడ్చవచ్చన్నారు. ప్రజల్లో నెలకొన్న ఆందోళనలను పరిష్కరించేందుకు ప్రభుత్వాలు చురుగ్గా వ్యవహరించాలని సూచించారు. సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ.. ప్రజలు దానిని అర్థం చేసుకునే తీరు ప్రాంతాలవారీగా మారుతుందన్నారు. "ఏఐతో లేబర్ మార్కెట్ మారుతుంది. కొన్ని ఉద్యోగాలు పోతాయి. కొన్ని ఉద్యోగాల్లో మార్పులు చోటుచేసుకుంటాయి. పరివర్తనను చక్కగా నిర్వహించిన సమాజాలు అభివృద్ధి చెందినట్లు చరిత్ర చెప్తోంది" అని ఉద్యోగాల గురించి వ్యక్తమవుతోన్న ఆందోళనపై స్పందించారు. అలాగే రోజూవారీ జీవితంలో మెరుగైన నిర్ణయాలు తీసుకోవడానికి ఏఐ తనకు ఉపకరిస్తోందని చెప్పారు.

# సూపర్-8కి పాకిస్థాన్

## నమీబియాపై ఘన విజయం..



టీ20 ప్రపంచ కప్‌లో పాకిస్థాన్ సూపర్ –8కి చేరుకుంది. కీలకమైన తమ చివరి లీగ్ మ్యాచ్‌లో నమీబియాపై 102 పరుగుల తేడాతో పాక్ ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన పాక్ 20 ఓవర్లలో 199/3 స్కోరు చేసింది. అనంతరం నమీబియా 17.3 ఓవర్లలో 97 పరుగులకే ఆలౌటైంది. ఓపెనర్ స్టీన్‌క్యాంప్ (23) టాప్ స్కోరర్ కావడం గమనార్హం. పాక్ బౌలర్లలో తారిక్ 4, షాదాబ్ ఖాన్ 3.. సల్మాన్ మీర్జా, నవాజ్ చెరో వికెట్ తీశారు. ఇప్పటికే టీమ్‌ఇండియా సూపర్–8కి దూసుకుపోగా.. పాకిస్థాన్ తన బెర్తును ఖరారు చేసుకుంది. దీంతో యూఎస్‌ఏ, నెదర్లాండ్స్, నమీబియా టీ20 ప్రపంచ కప్ నుంచి నిష్క్రమించాయి. టాస్ గెలిచిన పాకిస్థాన్ బ్యాటింగ్ ఎంచుకుంది. నమీబియా ఎదుట 200 పరుగులను లక్ష్యంగా నిర్దేశించడంలో ఫర్హాన్ కీలక పాత్ర పోషించాడు. తొలి బంతి నుంచి చివరి వరకూ క్రీజ్‌లో ఉన్న ఫర్హాన్ (100నాటౌట్: 58 బంతుల్లో 11 ఫోర్లు, 4 సిక్సులు) సెంచరీ సాధించాడు. దీంతో పాకిస్థాన్ 20 ఓవర్లో 3 వికెట్ల నష్టానికి 199 పరుగులు చేసింది. సైమ్ అయూబ్ (14), ఖవాజా నఫాయ్ (5) విఫలం కాగా.. కెప్టెన్ సల్మాన్ అఘా (38), షాదాబ్ ఖాన్ (36నాటౌట్) రాణించారు. నమీబియా బౌలర్లలో జాక్ బ్రాసెల్ 2, ఎరాస్మస్ ఒక వికెట్ తీశారు.



# దక్షిణాఫ్రికా ఘన విజయం

దిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా యూఏఈతో జరిగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన యూఏఈ 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 122 పరుగులు చేసింది. అనంతరం ఛేదనకు దిగిన దక్షిణాఫ్రికా 13.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 123 పరుగులు చేసింది. దక్షిణాఫ్రికా బ్యాటర్లలో డెవాల్డ్ బ్రెవిస్ (36; 25 బంతుల్లో, 1 ఫోర్, 3 సిక్సులు), ర్యాన్ రికెల్టన్ (30; 16 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సులు), ఐడెన్ మార్క్రమ్ (28, 11 బంతుల్లో, 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. యూఏఈ బౌలర్లలో హైదర్ అలీ, జవాదుల్లా, అర్ఫాన్, ఫారుఖ్ తలో వికెట్ తీసుకున్నారు. అంతకు ముందు యూఈఏ బ్యాటర్లలో అలీషన్ షరాఫు (45; 38 బంతుల్లో, 5 ఫోర్లు, 1 సిక్స్) బ్యాటింగ్‌లో రాణించాడు. మహ్మద్ వసీమ్ (22) ఫర్వాలేదనిపించాడు. దక్షిణాఫ్రికా బౌలర్లలో కార్బిన్ బోష్ 3, అన్రిచ్ నోర్జే 2, జార్జి లిండే 1 వికెట్ తమ ఖాతాలో వేసుకున్నారు.

# పాకిస్థాన్ చేసిన తప్పిదం అదే

## రవిచంద్రన్ అశ్విన్



పొట్టి ప్రపంచకప్‌లో భాగంగా టీమ్‌ఇండియా, పాకిస్థాన్ కొలంబోలోని ప్రేమదాస స్టేడియం వేదికగా ఆదివారం తలపడిన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లో భారత్ 61 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. అభిషేక్ శర్మ బ్యాటింగ్‌లో విఫలమైనప్పటికీ, మరో ఓపెనర్ ఇషాన్ కిషన్ (77, 44 బంతుల్లో) ధనాధన్ ఇన్నింగ్స్ ఆడాడు. దీంతో టీమ్‌ఇండియా 175 పరుగులు చేయగలిగింది. ఛేదనలో పాక్ జట్టు 18 ఓవర్లలో 114 పరుగులకే ఆలౌటైంది. ఒకానొక దశలో కనీసం 100 మార్కునైనా దాటుతుందా అనిపించింది. పాకిస్థాన్ ఘోర పరాజయంపై టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ తన యూట్యూబ్ ఛానల్ వేదికగా మాట్లాడాడు. 'ఆ పిచ్ మీద 175 పరుగులు కూడా 200 రన్స్‌తో సమానం. పాకిస్థాన్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకోవడంతోనే మ్యాచ్ ఓడిపోయింది. ఎందుకంటే ఈ పిచ్‌పై గత మ్యాచ్‌లో మనం జింబాబ్వే, ఆస్ట్రేలియా మధ్య మ్యాచ్ చూశాం. 170 పరుగులను ఆసీస్ జట్టు ఛేదించలేకపోయింది. భారత్‌తో మ్యాచ్‌లోనూ పాకిస్థాన్ ఛేదనలో ఇబ్బందిపడింది. తీవ్రమైన ఒత్తిడికి గురైంది. ఈ విషయంలో భారత్ 100 రెట్లు ఉత్తమం' అని అశ్విన్ అన్నాడు. షాహిన్ అఫ్రిదిని చాలా త్వరగా బౌలింగ్ అటాక్‌కు తీసుకువచ్చి పాకిస్థాన్ తప్పు చేసిందని, రవిచంద్రన్ అశ్విన్ అభిప్రాయపడ్డాడు. 'మొదటి ఓవర్ సల్మాన్ అఘా వేసిన తర్వాత, షాహిన్ అఫ్రిదిని బౌలింగ్‌కు తీసుకువచ్చి వారు చాలా పెద్ద తప్పు చేశారు. మొదటి ఓవర్‌లో పాకిస్థాన్.. అభిషేక్ శర్మ వికెట్ తీసుకుంది. గత మ్యాచుల్లో ఇషాన్ కిషన్.. లెఫ్ట్ ఆర్మ్ బౌలర్లను ఉతికి ఆరేశాడు. కానీ పాకిస్థాన్ కెప్టెన్.. ఎడమ చేతివాటం బౌలరైన షాహిన్ అఫ్రిదికే మళ్లీ బంతిని అందించాడు. కనీసం అతడు రౌండ్ ది వికెట్ అయినా వచ్చి బౌలింగ్ చేసి ఉండాల్సింది. కానీ అలా చేయలేదు. నా ఉద్దేశంలో రెండో ఓవర్ సైమ్ అయూబ్ వేసి ఉండాల్సింది' అని అశ్విన్ విశ్లేషించాడు.




# 15 రోజుల్లో డెత్‌క్లెయిమ్ సెటిల్‌మెంట్..

## బ్యాంక్‌కు వెళ్లే పనిలేకుండానే..

కుటుంబంలో ఎవరైనా దూరమైతే వారి బ్యాంక్ ఖాతాలోని నగదును పొందాలంటే బ్యాంకుల చుట్టూ తిరగాల్సిందే. మరణ ధ్రువీకరణ పత్రం, పాస్‌బుక్, మరణించిన వ్యక్తి కుటుంబ సభ్యుడు అని తెలిపేలా రుజువు పత్రాలు వంటివి పట్టుకెళ్లినా ఒక్కోసారి పని జరుగుతుందన్న గ్యారెంటీ లేదు. దీంతో చిన్నమొత్తంలో నగదు ఉన్న సందర్భాల్లో కుటుంబసభ్యులు ఆ నగదును అలానే వదిలేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐఓబీ) సులభతర విధానాన్ని పరిచయం చేసింది. డెత్ క్లెయిమ్ సెటిల్‌మెంట్ కోసం ఆన్‌లైన్ సదుపాయాన్ని తీసుకొచ్చింది. బ్యాంకు ఖాతాదారులు మరణించిన సందర్భాల్లో కుటుంబ సభ్యులు, వారి వారసులు బ్యాంకును సందర్శించకుండానే ఈ డెత్‌క్లెయిమ్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. రూ.15 లక్షల వరకు నగదు సెటిల్‌మెంట్‌కు ఎలాంటి థర్డ్ పార్టీ ష్యూరిటీ అవసరం లేదని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ పేర్కొంది. పైగా 15 రోజుల వ్యవధిలోనే క్లెయిమ్‌లను సెటిల్ చేస్తామని వెల్లడించింది. ఇందుకోసం ఐఓబీ పోర్టల్‌లో డెత్‌క్లెయిమ్ సెటిల్‌మెంట్ విభాగంలోకి వెళ్లి.. సంబంధిత డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. క్లెయిమ్ ఫారం, ఖాతాదారుడి డెత్ సర్టిఫికెట్, నామినీ గుర్తింపు పత్రాలను అప్‌లోడ్ చేయాలి. నామినీ లేని పక్షంలో ఇండెమ్నిటీ బాండ్, డిస్‌క్లెయిమర్ లెటర్, లీగర్‌హెయిర్ సర్టిఫికెట్ వంటివి సమర్పించాల్సి ఉంటుంది.

### ఆర్‌బీఐ మార్గదర్శకాల మేరకు..

డెత్‌క్లెయిమ్‌లకు సంబంధించి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గతేడాది సెప్టెంబర్‌లో కీలక మార్గదర్శకాలను జారీ చేసింది. చనిపోయిన వారి బ్యాంకు ఖాతాలు, లాకర్లకు సంబంధించిన క్లెయిమ్ సెటిల్‌మెంట్ నిబంధనలను సవరించింది. 15 రోజుల గడువులోగా సెటిల్‌మెంట్ ప్రక్రియ పూర్తవ్వాలని, ఒక వేళ ఆలస్యమైతే నిర్దిష్ట పరిహారాన్ని నామినీలకు ఇవ్వాల్సి ఉంటుందని స్పష్టంచేసింది. 2026 మార్చి 31లోపు అన్ని బ్యాంకులూ ఈ మార్గదర్శకాలను పాటించాలని సూచించింది. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్ సౌలభ్యాన్ని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ తీసుకొచ్చింది. మిగిలిన బ్యాంకులూ ఈ తరహా సదుపాయాన్ని తీసుకొచ్చే అవకాశం ఉంటుంది.

Printed, published and owned by **VELLENKI JAYAPAL REDDY**, printed at **M/s KAKATIYA PRINTERS**, H-No: 24-91/72/1, Block No. 29, Plot Nos 72, 73 and 74, Lakshminarayana Nagar IDA Uppal, Uppal Mandal, Medchal-Malkajgiri Dist, Telangana-39, Published at H-No: 3-125/92/86, Anaghapuri Colony, Boduppal, Medipally Mandal, Medchal-Malkajgiri Dist, Telangana- 92, Editor: **VELLENKI JAYAPAL REDDY**, Cell No: **9346984911, 9133445456**, RNI NO: TELTEL/2023/84471, website: www.nedudailynews.com, e-mail: vellenkijayapalreddy@gmail.com